


# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, మార్చి 14, 2026 | సంపుటి - 20 | సంచిక 183 | వెల - 4రూ | పేజీలు - 12

Circulated by Vijayawada, AlluriSeetharamaraju, Vizianagaram,Parvathipuram, Srikakulam, Kakinada,East Godavari,Konaseema, West Godavari, Krishna,Guntur, Bapatla,NTR,Anantapuram, Satyasai Kurnool,Nandyala, Chittoor,Tirupati,Annamayya, Telangana State


## అమరావతి నిర్మాణాలు
# వేగవంతం


- నిర్మాణ పనుల వేగంగా పూర్తికి అనుమతి
- రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు
- చిన్నతరహా పరిశ్రమల ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి
- 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం
- 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణకు హాస్టళ్ల ఏర్పాటు
- ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం
- గ్యాస్ సరఫరాలో ఇబ్బందుఉల రాకుండా మంత్రుల పర్యవేక్షణ
- ఎపి కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు



అమరావతి : అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన సచివాలయం, ప్రభుత్వ విభాగాధిపతుల టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానిలో తెలుగు సంస్కృతిని చాటిచెప్పేలా రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. 2లో

## ఎపి జెన్కో
# అద్భుత ప్రతిభ

### ఒకే రోజు 6160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి
### అధికారులను అభినందించిన సిఎం చంద్రబాబు



అమరావతి : ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ విజయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఏపీ జెన్కో ఒకే రోజు 6160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సాధించి సరికొత్త చరిత్ర సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఈ నెల 11వ తేదీన, 6160 మెగావాట్ల ఉత్పత్తితో 93.19 శాతం సామర్థ్యాన్ని సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ రికార్డు ఒక్కరోజే సాధించడం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగానికి సాక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించడంలో భాగస్వాములైన జెన్‌కో ఎ-లాంట్ల కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది, ఉన్నతాధికారులకు, శాఖా మంత్రికి, మొత్తం జెన్‌కో టీమ్‌కు సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ 20 నెలల పాలనలో విద్యుత్ రంగం పుంజుకుని వెలుగులు జిమ్ముతోంది అనేందుకు ఈ ఘనత సాక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో జెన్‌కో సాధించే విజయాలు రాష్ట్రానికి మాత్రమే కాకుండా, దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఒకే రోజు 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించటం జెన్‌కోకి చరిత్రాత్మక ఘనత అని వెల్లడించారు. 2లో




## ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్
# ప్రమాణం

### ప్రమానస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ఆవరణలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు పంజాబ్, హరియాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు నుంచి జస్టిస్ లిసా గిల్ ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో రెండో స్థానంలో కొనసాగుతారు. 2లో



2

## ఇరాన్ వ్యూహాత్మక
# అడుగులు

- అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు
- గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు



2

## దేశంలో గ్యాస్
# కొరత లేదు

- ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు
- కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది.

## రష్యా నుంచి చమురు కొనుగోళ్లు

- భారత్‌కు అనుమతించిన అమెరికా వాణిజ్య శాఖ
- ఇందన సంక్షోభానికి తెరదించే యత్నంగా వెల్లడి




వాషింగ్టన్ : ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది.

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు



### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. 2లో

## మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ
# వ్యతిరేకించలే

- ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం
- మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం
- మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి
- పదేపదే బిజెపిని విమర్శించడం అపండి
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు




హైదరాబాద్ : మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. 2లో




## అసోంలో రూ.4,500 కోట్ల
# విలువైన ప్రాజెక్టులు

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

గువాహటి : అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝార్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తరువాయి 2లో

## గృహ వినియోగదారులకు
# గ్యాస్ సరఫరా

- ఇక్కట్లు లేకుండా... బ్లాక్ మార్కెట్ జరక్కుండా చర్యలు
- పెట్రో డీలర్లతో సిఎస్ రామకృష్ణారావు సమీక్ష



హైదరాబాద్ : రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్యాస్ కంపెనీలను సిఎం రామకృష్ణారావు ఆదేశించారు. రోజువారి సమీక్ష, బ్లాక్ మార్కెటింగ్ లేకుండా చర్యలు, డిస్ట్రిబ్యూటరీలు, ఎజెన్సీల దగ్గర పోలీస్ నిఘా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇంధన నిల్వలు, గ్యాస్ వినియోగదారులకు పంపిణీ, ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై అధికారులతో సమీక్ష చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. 2లో

## ఇంధన, గ్యాస్ కొరతపై
# ప్రభుత్వం సమీక్ష

- కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు
- అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చిన మంత్రి ఉత్తమ్
- మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం కమిటీలు




హైదరాబాద్ : దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు.

తరువాయి 2లో

శనివారం
14-03-2026

నినాదం
నిఖార్సైన జర్నలిజం



# ఘోర రోడ్డు ప్రమాదం

పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టూరిస్ట్ బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా... డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదం గన్నారం గ్రామ శివారులోని బ్రహ్మంగారి ఆలయం దగ్గర చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, అత్యవసర సేవలకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. బస్సు బోల్తా పడిన సమయంలో తీవ్ర గాయాలు కారణంగా వారు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడగా వారిని స్థానికుల సహాయంతో సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఇతర పెద్ద ఆస్పత్రులకు తరలించినట్లు సమాచారం. వైద్యులు గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ బృందాలు శ్రమించాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం అయింది. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయువు, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాటి మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టళ్లకు ఎల్పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రిఫైనింగ్ కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా

ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుత డిమాండ్ కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్ల కు డిమాండ్ మేరకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన చేందాల్సిన అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 డిస్టిబ్యూటరీ కేంద్రాలు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నాయని అన్నారు. వినియోగదారులకు సకాలంలో డెలివరీ జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమయానికి సరఫరా అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం సమీక్ష

మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని, దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్యాస్ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు ఒఖఉ కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయి. హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు. తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తమ్ చెప్పారు.

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు

సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు. రష్యాకు వచ్చే ఆదాయంలో అధిక భాగం చమురు వెలికితీసే సమయంలోనే పన్నుల రూపంలో అందుతుందని, ఇప్పుడు రవాణాలో ఉన్న చమురు అమ్మకం వల్ల వారికి అదనపు ప్రయోజనమేమీ ఉండదని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల స్వల్పకాలికంగా ధరలు పెరిగినా.. దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో మేలుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే.. తాజా సడలింపులతో మార్చి 12 నాటికి నౌకల్లో లోడ్ అయిన రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను ఏప్రిల్ 11 వరకు విక్రయించుకోవచ్చు. గతంలో అమెరికా ఆంక్షలు విధించిన రష్యన్ సంస్థల నుంచి ఉత్పత్తైన చమురును కూడా ఇప్పుడు కొనుగోలు చేసుకోవచ్చు. ఇకపోతే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాంకర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల అనంతరం.. భారత జెండాలు కలిగిన నౌకలకు టెహ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామంతో అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కుంటున్నప్పటికీ.. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు వ్యూహాత్మకంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు పేర్కొన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు సంబంధంలేని నౌకలకు మాత్రం ఆంక్షల నుంచి సడలింపునిచ్చింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన తర్వాత తొలిసారిగా భారతీయ నౌకలు జలమార్గం గుండా సురక్షితంగా ప్రయాణించడం విశేషం.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువు కోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. అందుకోసం తరగతి ఉపాధ్యాయులు లేదా, మంచి స్నేహితులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో చక్కటి వాతావరణం కల్పించాలి. విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ప్రతిక్షణం కృషి చేయాలి. అవసరమైన ధైర్యం అందివ్వాలి. పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు కనుక వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానుకూలంగా విద్యార్థికి తగిన పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సమయానికి తగినంత నిద్రపోయేలా కూడా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఇప్పటికే రెండు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాం. గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టలలో మంచి మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మార్చి 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నాం అని అధికారులు వివరించారు.

# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

న్యూఢిల్లీ : అమెరికా, ఇజ్రాయిల్ కలసి చేస్తున్న యుద్ధంతో ఇప్పుడు ప్రపంచం యావత్తూ అతలాకుతలం అవుతోంది. ప్రధానంగా ఇంధన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ యుద్ధం నుంచి వెన్నక్కి తగ్గలేక, ముందుకు వెళ్లలేక గింజుకుంటున్నాయి. ఈ యుద్ధంతో ఇజ్రాయిల్ పెద్దగా నష్టపోకున్నా, అమెరికా మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. అలాగే ఇరాన్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యం నెరవేరలేదు. అంతేగాకుండా ప్రజల మద్దతుతో ఇరాన్ మరింత బలంగా దాడులను తిప్పికొట్టడానికి సిద్ధం అవుతోంది. ఇది ఓ రకంగా అమెరికాకు పెద్ద నష్టం కానుంది. రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేసి కాళ్లూచేతులు కాల్చుకుంటోంది. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ ప్రస్తుత హెచ్చరికలు అమెరికాకు గుణపాఠం కావాలి. అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయి ప్రాదేశిక రాజకీయ సంక్షోభంగా మారింది. ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకూ, సముద్ర రవాణా మార్గాలకూ, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధ వద్ద ఇరాన్ పట్టుతో ప్రపంచ దేశాలకు గమ్యం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అమెరికా అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్‌లు హతమార్చడం ద్వారా ప్రత్యర్థి దేశపు బలాన్ని అంచనా వేయలేక పోయారు. అధినేతను తొలగిస్తే ఆ దేశాన్ని లొంగదీసుకోవాలన్న ఎత్తుగడలు దెబ్బతిన్నాయి. తమ అధినాయకుడి మరణం లేదా బలిదానం షియా వర్గాన్ని మరింత భీకర ప్రతిఘటనకు పురిగొల్పుతుంది. తమ అధినేత మరణం ప్రజల్లో ప్రతీకారేచ్ఛను పెంచుతుంది. దేశాన్ని బలహీనపరచే బదులు ప్రభుత్వానికి ప్రజల మద్దతును మరింత విస్తృతం చేస్తుంది. సైనిక దాడుల్లో సాధారణ పౌరులు మరణించడం ద్వారా అమెరికా తలనొప్పులు తెచ్చుకుంది. పలుప్రాంతాల్లో ప్రజాగ్రహాన్ని పెంచుతోంది. బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో, పత్రికలూ టీవీ ఛానళ్లలో వేగంగా ప్రసారమవుతూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్నీ, దౌత్య సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు, తనపై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి సహకరించిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితరాలపైనా... ముఖ్యంగా అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయలేక పోవచ్చు కానీ, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక వసతులను కకావికలం చేయగలదు. అందుకనే గల్ఫ్ దేశాలు ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇలా జరుగుతందని అమెరికా ఊహించకపోవడం కూడా యుద్ధ వైఫల్యంగానే భావించాలి. ఓ రకంగా ఇరాన్ తెలివిగా అమెరికాను దెబ్బతీస్తోంది. అనేక గల్ఫ్ దేశాలు తమ విధానాలకు అనుగుణంగా అగ్రరాజ్య స్థావరాలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ స్థావరాలు పశ్చిమాసియా అంతటా నిఘా కార్యకలాపాలు, నౌకాదళ మోహరింపులు, యుద్ధ విమానాల ప్రయాణాలకు వీలుకల్పిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధంలో ఈ స్థావరాలపై ఇరాన్ గురిపెట్టడం ద్వారా అమెరికాను దెబ్బ కొట్టడంలో కృతకృత్యమయ్యిందనే చెప్పాలి. అందుకే ఇరాన్‌పై దాడి ద్వారా అమెరికా సాధించింది సున్నాయే కాక, ఈ యుద్ధంలో విజేత ఇరాన్ అనే చెప్పాలి. ఈ క్రమంలో తటస్థంగా ఉండాలని భావించిన దేశాలు కూడా ఇప్పుడు యుద్ధంలో ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంధన సరఫరా గొలుసులకు కేంద్రమైన పశ్చిమాసియా మొదటి నుంచీ అగ్రరాజ్యాల పోటీకి వేదికగా ఉంది. రష్యా, చైనాలకు ఇరాన్‌తో వ్యూహాత్మక సంబంధాలున్నాయి. అవి నేరుగా జోక్యం చేసుకోకున్నా- దౌత్య, ఆర్థిక మద్దతుతో ప్రభావితం చేస్తున్నాయి. హర్మూజ్ జలసంధి ఇరాన్ అదుపులో ఉండటం ఆ దేశానికి వ్యూహాత్మక బలంగా చూడాలి. అదే తమ ట్రంప్ కార్డు అని ఇరాన్ నూతన అధినేత కూడా వ్యాఖ్యానించారు. ఇకపోతే గల్ఫ్ పరిణామాలు భారతదేశంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్నాయి. ఇండియా ముడి చమురు కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయం కలగడంతో అది భారతదేశ ఇంధన భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. అయితే ఇవన్నీ ఇప్పట్లో కలొఇక్కి వస్తాయని అనుకోవడానికి లేదు. ప్రత్యమ్నాయాలు చూసుకోవాల్సిందే.

# అమరావతి నిర్మాణాలు వేగవంతం

అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు పలు అంశాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశర చేసింది. చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. దీనికోసం 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. మహిళా ఉద్యోగుల కోసం 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణ సౌకర్యాలు కలిగిన హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నారు. పోలీసు శాఖలో 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంఎ÷-లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలను చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన పనుల కోసం దాదాపు రూ.48 కోట్లను అదనంగా కేటాయించారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని, ఆ లోపు కాలువలు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం 'జలధార' కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టి, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్‌లో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు కేటాయింపు, పోలవరం ప్యాకేజ్-64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతి లభించింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు చేస్తూ ఆమోదించింది. క్యాబినెట్‌లో అజెండా అంశాలు ముగిసిన తర్వాత వివిధ అంశాలపై సీఎం చర్చించారు. గ్యాస్ కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు గ్యాస్‌కు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎలక్ట్రిక్ స్టవ్‌లతో విద్యుత్ డిమాండ్ పెరగడంతో పరిస్థితి పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరుపై నివేదికలు ఇస్తానని, వాటి ఆధారంగా సమీక్ష చేసుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపట్టాలన్నారు. చివరి ఎకరానికి కూడా నీరిచ్చేలా జలధార కార్యక్రమం జరగాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ అజెండా ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు గ్యాస్ సరఫరా, విద్యుత్ వినియోగంపై చర్చించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత వల్ల ప్రజలు ఎలక్ట్రిక్ స్టవ్‌ల వైపు మళ్లుతున్నారని, దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 2న ప్రభుత్వ శాఖల పనితీరుపై నివేదికలు విడుదల చేస్తానని.. ఆ ఆధారంగా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని మంత్రులకు దిశానిర్దేశంచేశారు.

## జెఇఇ దరఖాస్తుదారులకు ఛాన్స్

హైదరాబాద్,మార్చి13 : జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలనే వారికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుభవార్త చెప్పింది. దరఖాస్తు చేసుకొనేందుకు మరో చాన్స్ ఇచ్చినట్టు పేర్కొన్నది. విద్యార్థుల నుంచి పెద్దఎత్తున వినతులు వచ్చిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ విండోను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించింది. గురువారం నుంచి శుక్రవారం రాత్రి 9 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల్లో మార్పు చేసుకొనే అవకాశం లేదని స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9 వరకు జరుగనున్నాయి.

# ఎపి జెన్కో అద్భుత ప్రతిభ

ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగం భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించేందుకు సిద్ధమైందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

# ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ సీజేగా నియమితులు కానున్నారు.ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె చరిత్ర పుటలకెక్కనున్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్ జనరల్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు సీనియర్ న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా.. ప్రస్తుతం 33 మంది ఉన్నారు. జస్టిస్ లిసా గిల్ రాకతో ఈ సంఖ్య 34కు పెరిగింది. ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ ఏడాది ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత ఆమె సీజేగా నియమితులు కానున్నారు. దీంతో ఏపీ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డ్ సృష్టించనున్నారు.

# మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే

అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.

# ఏలూరు జిల్లా వార్తలు



## 22న ఏలూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు, మార్చి 13 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 22వ తేదీ ఉదయం 10. 30 ని.లకు ఏలూరు లోని జిల్లా ప్రజాపరిషత్ సమావేశపు హాలులో జిల్లా పరిషత్ అధ్యక్షులు ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని, సమావేశంలో వివిధ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్షించడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.





# ప్రతీ రైతుకు గిట్టుబాటు ధర అందిస్తాం

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులకు మేలు చేస్తాం

## సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం : ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు

ఏలూరు, మార్చి 13 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకారమార్కెటింగు సొసైటీ లిమిటెడ్, మహాజన సభ సమావేశమునకు డిసియంఎస్‌చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగాఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. స్థానిక డిసియంఎస్‌ఫంక్షను హాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార మార్కెటింగు సొసైటీలిమిటెడ్, మహాజన సభ సమావేశమునకు డిసియంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. సంఘము యొక్క 2026-27 ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన అంచనా బడ్జెటును, సంఘపు నాన్ ఆఫిసియల్ పర్సన్ ఇంచార్చి చైర్మన్ అనుమతితో ప్రవేశపెట్టబడిన ఇతర అంశాలు ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా సహకార మార్కెటింగు సొసైటీ లిమిటెడ్ మహాజన సభలో పాల్గొనుటలో ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తమ ప్రభుత్వం సహకార సంఘాలు పురోభివృద్ధిలో ఉండేలా కృషి చేసిందన్నారు. కాన్స్ ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలతో పాటు సహకార రంగాలు వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. దశలు వారీగా ఉన్న సమస్యలు అధిగమించి, నష్టాలు నుండి లాభాలు బాటలో పయనించేలా సహకార సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు. యుపిఏ సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కమర్షియల్ బ్యాంకులతో పోటీలో నిలబడుతూ, రైతులకు మంచి మేలు చేసే కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తామని తెలిపారు. సహకార రంగాలు రైతులు అభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, రైతులు సేంద్రియ వ్యవసాయంతో పండించిన వివిధ రకాలు పంటలు, అపరాలు, అవసరమైన మార్కెటింగు సౌకర్యాలు, ఆర్థిక సహాయం మరియు ఇతర సేవలను అందించడంలో సహకార సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మేధావులు, పర్యావరణ వేత్తలు, రైతు సంఘాలు నాయకులు, రైతులు సలహాలు, సూచనలను స్వీకరించి సొసైటీ అధికారులు, అధ్యక్షులు సహకారంతో సహకార సంఘాలు మరింత అభివృద్ధి చేసి మంచి సేవలు అందిస్తామని తెలిపారు. డిసియంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) మాట్లాడుతూ రైతులు సంక్షేమం, అభివృద్ధి మరియు సహకార రంగాలు మరింత బలోపేతం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా రైతులకు గిట్టుబాటు ధర పొందేలా రైతులకు అవగాహన సదస్సులు ద్వారా తెలియజేస్తామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు, అపరాలు కొనుగోలు ఉన్నాయని అలాగే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలని రైతులు కోరికను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్ళి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులకు కూడా మేలు జరిగేలా చూస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించి, ఆరోగ్య సమాజాలుగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని, ఈ దిశగా ముందుకు అడుగులు వేస్తామని అన్నారు. యుపిఏ సేవలు ద్వారా ఫోన్ పే, గూగుల్ పే, క్యూ ఆర్ కోడ్ లు , వాట్సాఫ్ సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కమర్షియల్ బ్యాంకులతో పోటీలో నిలబడుతూ, రైతులకు మంచి మేలు చేసే కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో సొసైటీ ప్రగతి, రైతులకు అందిస్తున్న సేవలు, భవిషత్తు కార్యాచరణ వంటి అంశాలుపై చర్చించామని అన్నారు. రైతులు అభివృద్ధి మరియు సహకారరంగం బలోపేతం కోసం సొసైటీలు మరింత కృషి చేసేలా కార్యాచరణ రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. రైతులకు అవసరమైన సహాయ,సహకారాలు అందిస్తూ, వ్యవసాయ రంగం అభివృద్ధికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషించేలా, పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. సమావేశంలో డిసివో అరిమిల్లి శ్రీనివాసు, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి కె.సత్యవతి, బిజినెస్ మేనేజరు ఇంచార్చి వెల్లంకి శివకృష్ణ మోహన్, ప్రముఖ పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ, మాజీ డిసియంఎస్ చైర్మన్ నడింపల్లి సత్యనారాయణ రాజు, పాలకోడేరు కోపరేటివ్ సోసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, సహకార సంఘాలు అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు, బిజినెస్ మేనేజర్లు, డిసియంఎస్, డిసిసిబి ఉద్యోగులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

## సీసీ రోడ్ల నిర్మాణపనులకు భూమిపూజలో ఎమ్మెల్యే డా.కామినేని

మండవల్లి, మార్చి13 : నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండవల్లి మండలంలో భైరవపట్నం, మండవల్లి, పెరికేగూడెం, లింగాల, కానుకొల్లు గ్రామాల్లో నరేగా నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కామినేని మాట్లాడుతూ.. కూటమి సర్కార్ ఆంధ్రను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఏ శాఖకు సంబంధించిన నిధులు ఆ శాఖకు అందుతున్నాయి కాబట్టే అభివృద్ధిలో ఎక్కడా రా.ఈ పడటం లేదని తెలిపారు. ఒక పక్క సంక్షేమం మరో పక్క అభివృద్ధి తో అద్భుతమైన పాలన అందించటం ఒక్క ఎన్డీఏ కూటమికే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గా ప్రసాద్, ఎన్‌డియే నేతలు చాపరాల దుర్గా ప్రసాద్,సజ్జాబాబి, శివాలయ చైర్మన్ గుడివాడ గణేష్‌లతో పాటు నియోజకవర్గ,మండలస్థాయి ఎన్‌డియే నేతలు,అధికారులు పాల్గొన్నారు.



# కూటమి హయాంలోనే వినూత్న కార్యక్రమాలు : ఎమ్మెల్యే కామినేని

## స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



మండవల్లి, మార్చి 13 : కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తు జనరంజకమైన పాలన అందిస్తుందని ఏపి.ప్రభుత్వ అస్యూరెన్సు కమిటి చైర్మన్, ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ అన్నారు. ఏపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే కామినేని శుక్రవారం మండవల్లిలో ప్రారంభించారు. చెత్త సంపద కేంద్రాలను పెట్టిన కూటమి ప్రభుత్వం అదే విధంగా చెత్తను తీసుకుని నిత్యావసర సరుకులు అందివ్వటం అభినందనీయమని కామినేని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్,కూటమి నేతలు పాల్గొన్నారు.



# ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బడేటి




ఏలూరు, మార్చి 13 : ప్రజలెదుర్కొంటున్న సమస్యలకు శాశ్వతపరిష్కార చర్యలు చేపట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రజా అవసరాలను గుర్తించడంతో పాటూ నిరంతరం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే అత్యధిక సమయం కేటాయిస్తూ వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరులోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజల నుండి ఎమ్మెల్యే బడేటి చంటి సమస్యలతో కూడిన వినతిపత్రాలను స్వీకరించారు. వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాధినేతల లక్ష్యాలకు తగ్గట్టుగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఎక్కువ సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని ఆయన చెప్పారు. డ్వాక్రా సంఘాల మధ్య సమన్వయ లోపం ఉంటే గ్రూపు సభ్యులందరికీ నష్టం జరుగుతుందని, ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టుకుని డ్వాక్రా గ్రూప్ సభ్యులు ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాస్, ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు బెల్లపుకొండ కిషోర్, బిఎస్ఎన్ఎల్ జిల్లా డైరెక్టర్ లంకపల్లి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల సంక్షేమానికి త్రిసభ్య కమిటీ కృషి చేయాలి

## నర్సాయిపాలెం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే డా.కామినేని







కైకలూరు, మార్చి 13 : నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సొసైటీ త్రిసభ్య కమిటీలు అన్నదాతల సంక్షేమానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ సూచించారు. కైకలూరు మండలం దొడ్డిపట్లలో నరసాయిపాలెం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.కామినేని పాల్గొని నూతన త్రిసభ్య కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధికి కమిటీ సభ్యులు ఎల్లప్పుడు కృషి చెయ్యాలని సూచించారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా బోడావుల ఎలీషారాజు, డైరెక్టర్లుగా గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, బోయిన శాంతకుమారిలు పదవీప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్‌రావు, నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఎన్డీఏ కూటమినాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## పార్టీ కార్యాలయం వద్ద నుండి భారీ బైక్ ర్యాలీ : అప్పలనాయుడు



ఏలూరు, మార్చి 13 : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు సూచనలతో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల జనసేన ఆధ్వర్యంలో ఉమ్మడిగా నిర్వహించనున్నామని ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన అనగా శనివారం ఉదయం 9:00 గంటలకు ఏలూరు జనసేన పార్టీకార్యాలయంలో జెండా ఆవిష్కరణ, అనంతరం పార్టీ కార్యాలయం భారీ బైక్ ర్యాలీ. ఈ ర్యాలీ ఏలూరు జనసేన కార్యాలయం వద్ద నుండి ప్రారంభం కానున్నాయి. పవర్ పేట, ఆర్‌ఆర్ పేట, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా పాత బస్టాండ్, మెయిన్ బజార్, గడియార స్తంభం మీదుగా ర్యాలీగా బయలుదేరి కస్తూరిబాయి స్కూల్ సమీపంలో ఉన్న మర్చంట్ చాంబర్ కళ్యాణ మండపం వద్దకు చేరుకుంటామని, అక్కడితో ర్యాలీ ముగుస్తుంది. అనంతరం ఆ కళ్యాణమండపంలో సమావశం జరుగుతుంది. జనసేన పార్టీ అధిష్టానం మేరకు ఈ కార్యక్రమాన్ని ఏలూరు, దెందులూరు జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణాలు, కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలన్ని విషయాలను చర్చించనున్నామన్నారు. కార్యక్రమానికి ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

# బాలికలకు హెచ్‌పివి టీకాలు వేయించాలి : ఎమ్మెల్యే డా.కామినేని




కైకలూరు, మార్చి 13 : 14 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు విధిగాహెచ్‌పివి టీకాలు వేయించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీచైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ సూచించారు. కైకలూరు మండలం సీతనపల్లి పిహెచ్‌సిలో శుక్రవారంగర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు ముందస్తు చర్యలలో భాగంగా 14 సంవత్సరాలు నిండిన ఆడ బిడ్డలకు డాక్టర్ల పర్యవేక్షణలో HPV టీకాలను అందించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ.. ఆడ బిడ్డలు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ భారిన పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టిందదన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో ఉన్న 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడ బిడ్డకు ఈ టీకా వేసేలా పిహెచ్‌సిలోని డాక్టర్లు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం మేరకు పాఠశాలలకు వెళ్లి టీకాలు వేయాలని అన్నారు. అనంతరం గ్రామస్థులు పిహెచ్‌సి ప్రధాన మార్గం అస్తవ్యస్థంగా మారిందని తెలుపగా తక్షణమే యుద్ధ ప్రాతిపధికన సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వంటగ్యాస్ సరఫరాపై ఆందోళన వద్దు : ఎమ్మెల్యే డా. కామినేని





కైకలూరు, మార్చి 13 : వంటగ్యాస్‌కు సంబంధించి ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరి ఇంటికి గ్యాస్ సరఫరా జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇరాన్-అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం కారణంగా గ్యాస్ దిగుమతి ఆలస్యమవుతోందని, కేంద్ర ప్రభుత్వం అందుకు ప్రత్యామ్నాయం చూస్తోందని, త్వరలోనే సమస్య పరిష్కారమవ్వుతుందని కామినేని తెలిపారు. ఈ సందర్భంగా కామినేని, కైకలూరులో గోపవరం రోడ్డులోని గ్యాస్ ఏజెన్సీని పరిశీలించారు. వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ ఉద్యోగులకు సూచించారు. టోకెన్ల పద్ధతి పెట్టి గ్యాస్ సిలిండర్లను పంపిణి చెయ్యాలని అన్నారు. వేసవి దృష్ట్యా వారికి తాగునీరు అందించాలని అలానే షామియానా ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు

# నేడు జాతీయ లోక్ అదాలత్

## ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలి : న్యాయమూర్తి శ్రీదేవి



ఏలూరు, మార్చి 13 : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్లో శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ ను ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి విలేకరులు సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం మొదటి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్, వాహన ప్రమాద భీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్ కేసులు మరియు ప్రీ లిటిగేషన్ రాజీ చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం డిసెంబరు నెలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ నందు 10,798 కేసులను రాజీ చేయడం జరిగిందని, అందులో 2,517 పెండింగు కేసును రాజీ చేయడం జరిగిందని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు 9,345 కేసులు రాజీయోగ్యమైనవి గుర్తించడం జరిగిందని కావున ఈ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కక్షి దారులు సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, కేసులు పరిష్కారంలో సందేహాలు ఉన్న 08812 22455కు ఫోను చేయవచ్చని సూచించారు. ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం మాట్లాడుతూ కేసులు పరిష్కారానికి న్యాయ వాదులు అందరూ కృషిచేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాత్రికేయులు సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు పాల్గొన్నారు.

# పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా : ఎంపీ పుట్టా



ఢిల్లీ/ఏలూరు, మార్చి 13 : డిజిటల్, సోషల్ మీడియాప్లాట్ఫామ్‌లలో హానికరమైన కంటెంట్, వాడకం నుండి పిల్లలను రక్షించడానికి అనేక చర్యలను చేపట్టినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. సోషల్ మీడియా వాడకం పిల్లలపై,వారి మానసిక ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావంపై ఏలూరు ఎంపీ పుట్టామహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు గురువారం లోక్ సభలో కేంద్ర మంత్రిసమాధానం ఇచ్చారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) చట్టం, 2000, పిల్లలడేటా రక్షణ , India AI మిషన్ కింద సోషల్ మీడియా ప్లాట్ఫామ్‌లలోహానికరమైన కంటెంట్‌హో పిల్లలను రక్షించడానికి అనేక చర్యలు తీసుకున్నట్లువెల్లడించారు. సోషల్ మీడియాలో హానికర కంటెంట్ వ్యాప్తి నిరోధానికితీసుకుంటున్న చర్యలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన మరో ప్రశ్నకుకేంద్ర మంత్రి సమాధానం చెబుతూ.. చట్టాన్ని ఉల్లంఘించే కంటెంట్ నుపోస్ట్ చేయడం లేదా షేర్ చేయడాన్ని సోషల్ మీడియా ప్లాట్ఫారమ్‌లునిరోధించాలని ఆదేశించినట్లు తెలిపారు. సమాచార భద్రతలో మానవ వనరులవినియోగంలో జాగ్రత్తలు, సైబర్ భద్రత అంశాలపై సాధారణ అవగాహననుకల్పించడానికి ISEA ™ | Õ MeitY ఒక ప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు, దేశవ్యాప్తంగా 4,309 అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయనీ, వీటిలో పాఠశాల/కళాశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంస్థలు, ప్రభుత్వ సిబ్బంది, సాధారణ ప్రజలు సహా 9.63 లక్షల మంది పాల్గొన్నారని, పాఠశాల పిల్లలు, విద్యార్థుల కోసం 1,186 అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయని కేంద్ర మంత్రి వివరించారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు పంపిణీ

జీలుగుమిల్లి (పోలవరం), మార్చి 13 : పోలవరం నియోజకవర్గంలోని పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా,ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా ప్రోత్సహించేందుకు సీబీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన పరీక్ష కిట్లను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అందజేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 2,555 మంది పదవ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు పరీక్ష కిట్లను అందజేశారు. విద్యార్థులకు అందజేసిన పరీక్ష కిట్లలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్‌లు, షార్పెనర్, జామెంట్రీ బాక్స్ వంటి పరీక్షలకు అవసరమైన అన్ని సామగ్రి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కిట్లు విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడం ద్వారా తమ కుటుంబానికి, సమాజానికి గౌరవం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉందని, ప్రతి విద్యార్థి మంచి లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాయం కృష్ణ, సింగరాజు, మడివి బాబురావు, రావుల వెంకటేశ్వరరావు, ఎస్ నాగేశ్వరరావు, టి వెంకటేశ్వరరావు, సోదం రాజు,కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత ప్రచార ఉద్యమానికి విశేష స్పందన : ఎమ్డీఓ



భీమవరం, మార్చి 13 (సేన) : చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్, బాలల సంరక్షణ యూనిట్ వారిచే 100 డేస్ క్యాంపెయిన్-రిఫ్లెక్షన్ అండ్ వే ఫార్వర్డ్ వర్క్ షాప్ ను వీరవాసరం ఎంపిడిఓ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బాలల సంరక్షణ అధికారి రాజేష్ మాట్లాడుతూ 100 రోజు ల చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా ప్రోగ్రాం నవంబర్ 27న ప్రారంభమై మార్చి 7న మహిళా దినోత్సవం రోజున పూర్తయిందని ఈ 100 రోజులు చైల్డ్ మ్యారేజెస్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్స్ ని పశ్చిమగోదావరి జిల్లా అంతట విస్తృత ప్రచారం చేసిందని తెలిసిందన్నారు. కార్యక్రమంలో అన్ని స్కూల్స్ కాలేజీ లు ఫెయిత్ ప్లేసెస్ లో మత నాయకులతో బాల్య వివాహ వ్యతిరేక ప్లెడ్జను చేయించి వారిలో బాల్య వివాహాల పట్ల వచ్చే నష్టాలు తెలియజేశారు అంతేకాకుండా బాల్యవివాహాల వ్యతిరేక ప్రచార రథోత్సవం ద్వారా జిల్లాలోని అన్ని మండలాలు అన్ని గ్రామాలు తిరుగుతూ బాల్య వివాహ వ్యతిరేక ప్రచారాన్ని చేయించాము ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 ద్వారా మాకు తెలియజేయాలని కోరారుమండల తాసిల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ బాల్యవాహాలు ఎక్కడ జరిగినా తమ దృష్టికి తీసుకొస్తే బాలల సంరక్షణ అధికారికి ద్వారా వారికి కావాల్సిన కేర్ అండ్ ప్రొడక్షన్ అందిస్తామని తెలియజేశారు ఎంపీడీవో విజయ భవతి మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధించడానికి 100 రోజుల బాల్య వివాహ రహిత ప్రచార ఉద్యమానికి విశేష స్పందన వచ్చిందని తెలియజేశారు సిడిపిఓ లక్ష్మీకాంతం మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరిగిన తమకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లి వారికి తగిన కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాలను ఆపి వారికి కావాల్సిన అన్ని విధాల సహాయాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సిహెచ్ ప్రభాకర్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది అంగనవాడి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ



ఆగిరిపల్లి (నూజివీడు), మార్చి 13 (సేన) : నూజివీడు డిఎస్పీశ్రీ ప్రసాద్ ఆదేశాలమేరకు నూజివీడు రూరల్ సిఐ కె రామకృష్ణ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ తమ సిబ్బందితో కలిసి ఆగిరిపల్లి పరిధిలో నెక్కలం రోడ్డు లో విస్తృతమైన విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చని ఆయన తెలిపారు. అలాగే, వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని హితవు పలికారు. వేగం వద్దు ప్రాణం ముద్దు అనే నినాదాన్ని గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని ఆయన అన్నారు. మైనర్ల కు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే నష్టాలను వారికి వివరించారు. ఈ విజిబుల్ పోలీసింగ్ అవగాహన కార్యక్రమం ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి నేరాలను నివారించడానికి దోహదం చేస్తుందని ఎస్ఐ శుభ శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయాలలో మీ కుటుంబ సభ్యులు మీపై ఆధారపడి ఉన్నారని విషయాన్ని గుర్తుంచుకోవాలని సురక్షితమైనటువంటి ప్రయాణాన్ని చేసి సురక్షితముగా గమ్యస్థానాలకు చేరాలని సూచించారు.

# మహిళలంతా అభివృద్ధి చెందాలి




ఏలూరు, మార్చి 13 (సేన) : స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనమునందు శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాదు మాట్లాడుతూ మహిళలు జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని ఏ విధంగా ఎదుర్కొనాలి, పనిచేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు అనుసరించిన వలసిన విధివిధానాలు పైన అవగాహన కల్పించారు. మహిళా అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని అన్నారు. మహిళలు అభివృద్ధి చెందినప్పుడే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ ఆఫీసరు ఏలూరు తులసీదేవి, మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ వి.సుబ్బారావు, వన్ స్టాప్ సెంటరు అడ్మిన్ మిస్ నిర్మల, సైకాలజిస్ట్ మిస్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో కలిసి పనిచేయడం వరం : మంత్రి కొండపల్లి

అమరావతి, మార్చి 13 : స్పష్టమైన విజన్, అనుభవం ఉన్ననాయకుడు చంద్రబాబు అని.. ఆయనతో కలిసి పని చేయడం ఆ దేవుడుఇచ్చిన వరమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కలెక్టర్లకాన్ఫరెన్స్‌కు తాను ఒక మంత్రిగా హాజరైనా.. సీఎం చంద్రబాబు ముందు ఓ విద్యార్థిలా మారిపోయానన్నారు. "అన్ని శాఖల పని తీరుపై ఆయన అనర్గళంగా మాట్లాడటం ఒక ఎత్తు అయితే.. అధికారులను సబ్జెక్ట్ పరంగా అడుగుతోన్న ప్రశ్నలు విని ఆశ్చర్యపోయాను. బెస్ట్ ప్రాక్టీసెస్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు ఆయన ఇచ్చిన ఓ బృహత్తర కార్యక్రమం బహుశా దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావొచ్చు. 76 ఏళ్ల వ్యక్తి.. అలుపు, విసుగు లేకుండా నిర్విరామంగా బుధవారం 11 గంటలు, గురువారం 12 గంటల పాటు సమీక్షలు నిర్వహించారన్నారు.






# తెలుగు సాహిత్య చరిత్రలో మొల్లకు ప్రత్యేక స్థానం

## కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో ప.గో.జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం, మార్చి 13 : విలువలతో కూడిన కవిత్వాన్ని [illegible] పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో కవయిత్రి మొల్ల చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణాన్ని వివిధ భాషల్లో ఎందరో రచించారని, వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలో రచించడం గర్వించదగ్గ విషయమన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో కవయిత్రి మొల్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆమె రచించిన మొల్ల రామాయణం సాహిత్య అభిమానులకు ఎంతో భాషలో ఆమె రచనలు ఉండటం గొప్ప విశేషమని తెలిపారు. ప్రస్తుత తరం యువత మొల్ల వంటి మహానుభావుల సాహిత్యాన్ని తెలుసుకుని, వారి విలువలను ఆచరణలో పెట్టాలని సూచించారు. మహిళలు విద్యా, సాంస్కృతిక రంగాల్లో మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎ.వి సూరిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి.అరుణకుమారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, వసతి గృహాల సంక్షేమ అధికారులు రవీంద్రబాబు, కళ్యాణి, భూలక్ష్మి, వినీల, శ్రీనివాస్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఇరువురికి లయన్స్ క్లబ్ కుట్టుమిషన్లు పంపిణీ



ఉండి, మార్చి 13 : సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరిదేనిలోను దొరకదని ఉండి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజురంగరాజు అన్నారు. ఉండి మండలం NRP అగ్రహారం లయన్ రూత్ కళ స్వగృహంలో ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు పేదలకు కుట్టుమిషన్ సైకిలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రీజియన్ సోషల్ మీట్ సందర్భంగా రీజియన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్ ఉండి క్లబ్ కు కుట్టుమిషన్, సైకిలు సేవా కార్యక్రమంలో భాగంగా ఇచ్చినందుకు క్లబ్ తరపున ధన్యవాదాలు తెలిపారు. డి. సి మెంబర్ కన్నీగంటి రూత్ కళ మాట్లాడుతూ శ్రీనివాస్ సహృదయతకు అభినందనలు తెలిపారు. క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ గాదిరాజు వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ క్లబ్ సేవలను ప్రోత్సాహం ఇస్తూ మిషన్, సైకిలు ఇవ్వటం అభినందనీయం అన్నారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ ముదునూరి శివరామరాజు, బొండాడ కేశవరావు, భూపతిరాజు హరనాధరాజు తదితరులు పాల్గొన్నారు.

# మొల్ల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే బడేటి





ఏలూరు, మార్చి 13 : కవయిత్రి మొల్ల జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా తెలుగుదేశం పార్టీఅధ్యక్షులు బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్ పేట లోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో శుక్రవారం కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబజయంతిని నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటిచంటి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగులో రాసిన అనేక రామాయణాల్లో మొల్ల రామాయణం చాలా సరళమైనదని, సామాన్యులకు అర్థమయ్యే రీతిలో మొల్ల రామాయణాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాస్, ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, శాలివాహన సంఘం ప్రతినిధులు లాంగు వెంకట్రావు, మల్లారపు నరేంద్ర, వీరవాసరపు వీరన్న, రామలింగేశ్వరరావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



నూజివీడు, మార్చి 13 : నూజివీడు పట్టణంలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో శుక్రవారం తెల్లవారుజాము నుండి మునిసిపల్ అధికారులు, శానిటేషన్ వర్కర్స్ పరిశుభ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ కె పీరయ్య, మున్సిపల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ నరసింహారావు, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంతోష్ లు స్వయంగా చెత్త కుప్పలను పోగు చేయడం, కచ్చ డ్రైన్ లలో సిల్ట్ తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. ముళ్ళపొదలు, పిచ్చి మొక్కలను జెసిబిల సహాయంతో తొలగించారు. పనికిరాని రాళ్లగుట్టలు, చెత్త కుప్పలను తొలగించి నివాసాలకు మార్గం సుగమనం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ కె పీరయ్య,టీడీపీ నేతలు తలపంటి రాజశేఖర్, నజీమా లు మాట్లాడుతూ సుమారు 500 మంది మునిసిపల్ సిబ్బంది, శానిటరీ వర్కర్స్ తో పరిశుభ్ర కార్యక్రమం చేపట్టటం అభినందనీయమన్నారు. యుద్ధ ప్రాతిపదికన డాక్టర్ ఎంఆర్అప్పారావు కాలనీలో పరిశుభ్రం చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కంకణం కట్టుకున్న మున్సిపల్ అధికారులను ప్రశంసించాలన్నారు. నిత్య జీవన విధానంలో ఏర్పడే చెత్తను రోడ్లపై కుప్పలుగా పోయకూడదని, చెత్తను సేకరించే సిబ్బంది వచ్చిన సమయంలో తడి చెత్త, పొడి చెత్త లను వేరువేరుగా అందించాలన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం, నివాస పరిసరాలను మరింత పరిశుభ్రం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. చెత్త కుప్పలు వేయకుండా ఎవరికి వారే బాధ్యతాయుతంగా ముందడుగు వేస్తే అనేక దీర్ఘకాలిక, స్వల్పకాలిక అనారోగ్యాలు దరి చేరవని సోదాహరణంగా వివరించారు. కూడళ్లలో ఏర్పాటు చేసే డస్ట్ బిన్నులో చెత్తను వేయవచ్చని, ఇంటింటికి వచ్చి చెత్తను సేకరించే గ్రీన్ అంబాసిడర్స్‌కు మాత్రమే చెత్తను ఇవ్వడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నేడు పరిశుభ్రం చేసిన రీతిగానే నిత్యం ప్రధాన రోడ్లు, సంధులు ఉండాలన్నారు. ప్రతి సందుకు అక్కడ నివసించే ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తే చెత్త ఏమాత్రం చేరదని సూచించారు.

# లక్ష్మీనరసింహస్వామి హుండీ కానుకల ఆదాయం రూ.2.20 లక్షలు



కైకలూరు, మార్చి 13 : మండలంలోని వరహాపట్నంలోకొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి భక్తులు సమర్పించిన హుండీకానుకల ఆదాయం రూ.2.20 లక్షలు వచ్చింది. దే.ధ.శాఖ గుడివాడ తనిఖీదారు పర్యవేక్షణలో శుక్రవారం ఆలయ ఈఓ వివిఎన్‌కె శేఖర్ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలనులెక్కించారు. 12నెలల 14 రోజులుగా హుండీ తెరచి లెక్కించగా రూ. 2,20,095 లు వచ్చిందని, అలాగే, ఆటపాకలోని కనకలింగేశ్వర స్వామి ఆలయ హుండీ తెరిచి లెక్కించగా రూ.73,003లు వచ్చినట్టు ఈఓ వీఎన్‌కె శేఖర్ తెలిపారు.

# పెరిగిన బుకింగ్‌లు.. సరఫరాపై నిబంధనలు



**కట్టెలను ఆశ్రయిస్తున్న గృహస్థులు, హోటల్ నిర్వాహకులు**

**గ్యాస్ దొరక్క మూతపడుతున్న అనేక హోటళ్లు**

నిజామాబాద్ : యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గ్యాస్, పెట్రోలు, డీజిల్ సరఫరాలో మార్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో కమర్షియల్ సిలిండర్ల కొరత పెరిగింది. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులుంటే హోటళ్లు మూసివేయాల్సి వస్తుందని యాజమాన్యాలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే డిమాండ్‌కు సరిపడా కమర్షియల్ సిలిండర్లు లేకపోవడం, సరఫరా చేసే అవకాశాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ ప్రభావం గృహ కనెక్షన్లపైనా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎల్పీజీ కొరత లేదని అధికారులు చెబుతున్నా.. కొరత ఉంటుందనే వార్తలు వెలువడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు భయాందోళనకు గురవుతున్నారు. సిలిండర్లు బుక్ చేసేందుకు పోటీ పడుతున్నారు. ఈక్రమంలో బుకింగ్‌ల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతున్నది. గడిచిన నాలుగు రోజులుగా రోజుకు 25వేల పైచిలుకు బుకింగ్ అవుతున్నట్లు ఆయా గ్యాస్ కంపెనీలు ఏజెన్సీల ద్వారా తెలుస్తున్నది. గతంలో ఒక సిలిండర్ పూర్తయిన తర్వాత బుక్ చేసుకునేవారు. ప్రస్తుతం సిలిండర్ పూర్తి కాకముందే ముందు జాగ్రత్తగా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా గ్యాస్ సరఫరా లేక బుక్ కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సరఫరా విషయంలో ఇప్పటికే కంపెనీలు, ఏజెన్సీలు పలు నిబంధనలు పెట్టాయి. ఒక సిలిండర్ కనెక్షన్ ఉన్న వారు 21 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని, అలాగే రెండు సిలిండర్లు ఉన్న వారు 30 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని సూచిస్తున్నాయి. ఆ ప్రకారం బుక్ చేసినా సీరియల్ సంఖ్యను బట్టి డెలివరీ ఉంటుందని చెబుతున్నాయి. ఈ నిబంధన ఉమ్మడి కుటుంబాలు, ఎక్కువ కుటుంబ సభ్యులున్న కుటుంబాలకు ఇబ్బందిగా మారుతున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతానికి గ్యాస్ కొరత లేదని, కానీ, నిబంధనలు మాత్రం అమలు చేయక తప్పదని ఉమ్మడి జిల్లాలోని పౌరసరఫరా అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిజానికి ఇంకా వీలైనంత ఎక్కువ విక్రయించడానికి ఇన్నాళ్లూ ఆయా కంపెనీలు బంకు యజమానులకు వివిధ రకాల స్కీంలను అమలు చేశాయి. కానీ, మూడు రోజులుగా ఆ స్కీములను ఎత్తివేశాయి. దీనికి కారణం ఆయా కంపెనీలు వీలైనంత మేరకు.. డీజీల్ విక్రయాలను తగ్గించే దిశగానే ఆలోచనలు చేస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పరిశ్రమలను డీజిల్ కొరత వెంటాడుతున్నది. వాహనాలపై కూడా ఇప్పుడిప్పుడే ప్రభావం చూపుతున్నట్టు తెలుస్తున్నది. పరిస్థితి ఇలానే ఉంటే మరో మూడు నాలుగురోజుల్లో డీజిల్ ప్రభావం ప్రారంభమయ్యే అవకాశాలు ఉంటాయని యజమానులు చెబుతున్నారు.ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదంటూ చమురు సంస్థలు ప్రకటనలు చేస్తున్నాయి. గ్యాస్ కనెక్షన్‌దారులకు స్వయంగా మెసేజ్‌లు సైతం పంపిస్తూ అప్రమత్తం చేస్తున్నాయి. అవసరానికి తగిన మొత్తంలో సిలిండర్ల సరఫరా ఉందని చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో కాసులకు కక్కుర్తి పడుతోన్న గ్యాస్ ఏజెన్సీలు భిన్నంగా ప్రవర్తిస్తున్నాయి. కొరత ఉందంటూ ప్రచారం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఎల్పీజీ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సిలిండర్ బుకింగ్ చేసేందుకు క్యాష్ మాత్రమే తీసుకుంటుండటం అనుమానాలకు తావిస్తోంది. వారం క్రితం వరకు ఎల్పీజీ సిలిండర్ ధర రూ.928.50 ఉండగా రూ.60 పెంపుదలతో రూ.988కి చేరింది. వంటింట్లో సిలిండర్ అత్యవసరం కావడంతో రూ.వేయి వెచ్చిస్తున్నప్పటికీ సిలిండర్లు ఇంటికి చేరడం లేదు. ఇంట్లో పొయ్యి వెలిగించడమే గగనమైంది. సిలిండర్ బుక్ చేసేందుకు కొరత పేరుతో రూ.50 నుంచి రూ.100 వరకు గ్యాస్ ఏజెన్సీలు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుకింగ్ చేసుకున్న తర్వాత ఇంటికి సిలిండర్ చేర్చేందుకు సైతం సతాయిస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉందంటూ తప్పించుకుంటుండడంతో అదనంగా డబ్బులు ఇచ్చిన వారికే సరఫరా చేస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాణిజ్య సిలిండర్ల సరఫరా భారీగా క్షీణించింది. చమురు సంస్థల నుంచి డిమాండ్‌కు సరిపడా రాకపోవడంతో హోటళ్లు స్వచ్ఛందంగా మూసేస్తున్నారు. వ్యాపారాలు బంద్ చేసుకుని మిన్నకుండిపోతున్నారు. హోటళ్లు మూత పడటంతో ఉపాధి దెబ్బతిని కార్మికులు విలవిల్లాడుతున్నారు. మరోవైపు వివాహాల సీజన్ కావడంతో వాణిజ్య సిలిండర్ల కొరత ప్రభావం సెగలు పుట్టిస్తోంది. కట్టెల వంటపైనే వివాహాల్లో భోజనాలు రెడీ చేస్తున్నారు. ఒక్కసారిగా కట్టెలకు డిమాండ్ పెరుగుతుండటంతో వాటి ధరలు సైతం పెరిగినట్లుగా తెలుస్తోంది. కిరాయి ఇంట్లో జీవనం సాగించే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

**డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చిన జెఎసి**

హైదరాబాద్,మార్చి13 : తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలి.పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి.ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి. అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ వాసులకు మరో అర్బన్ పార్క్

**గుర్రంగూడ అటవీ భూములను రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తింపు**

**ఉత్తర్వుల జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం**

హైదరాబాద్ : నగరవాసులకు ప్రభుత్వం ఓ తీపి కబురు అందించింది. నగర శివార్లలో మరో భారీ పచ్చని ప్రదేశం 'అర్బన్ ఫారెస్ట్ పార్క్' రూపంలో అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ, ఆమన్‌గల్ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ అటవీ భూములను 'రిజర్వ్ ఫారెస్ట్'గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నగర పర్యావరణానికి పెద్ద పీట వేయనుంది. సుమారు 424 ఎకరాల 31 గుంటల భారీ విస్తీర్ణంలో ఈ అటవీ భూభాగం విస్తరించి ఉంది. తెలంగాణ ఫారెస్ట్ చట్టం-1967లోని సెక్షన్ 15 ప్రకారం.. పర్యావరణ, అటవీ శాఖ ఈ హోదాను కల్పించింది. ఈ భూముల్లోని సాహెబ్‌నగర్ కలాన్ గ్రామానికి చెందిన 102 ఎకరాలపై సుదీర్ఘ కాలంగా కోర్టులో వివాదం నడిచింది. దీనిని 'సాహెబ్‌నగర్ కలాన్ కేసు'గా పిలుస్తారు. చివరకు సుప్రీంకోర్టు అటవీ శాఖ వాదనను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో ఆక్రమణదారుల నుంచి ఈ భూమికి విముక్తి లభించింది. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న తరుణంలో? ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించే 'గ్రీన్ లంగ్ స్పేస్'గా దీనిని తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. పర్యాటకుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ కుటుంబాలతో కలిసి వారాంతాల్లో సమయాన్ని గడిపేలా విశ్రాంతి ప్రదేశాలు, చిన్నారుల కోసం ప్లే ఏరియాలు రానున్నాయి. అడవుల ప్రాముఖ్యతను వివరించేలా నాలెడ్జ్ సెంటర్లను ఇక్కడ నిర్మించే అవకాశం ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ హోదా రావడం వల్ల ఇక్కడ ఉన్న స్థానిక వృక్ష సంపద, జీవవైవిధ్యానికి చట్టపరమైన రక్షణ లభిస్తుంది. ఇకపై ఇక్కడ ఎలాంటి అనధికారిక నిర్మాణాలు లేదా ఆక్రమణలకు తావు ఉండదు. హైదరాబాద్ చుట్టుపక్కల ఇప్పటికే ఉన్న గజ్వేల్, శామీర్‌పేట వంటి అర్బన్ పార్కుల తరహాలోనే.. గుర్రంగూడ పార్క్ కూడా బిఎన్ రెడ్డి నగర్, హస్తినాపురం, సాగర్ రోడ్ ప్రాంతాల వారికి ప్రధాన పర్యాటక కేంద్రంగా మారనుంది.

## అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్దం చేయండి

**అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్,మార్చి13 : ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. సెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బ్జడెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బ్జడెట్ సమావేశాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నార ని తెలిపారు.

## మావోయిస్ట్ అగ్రనేత సంస్మరణ సభ

**హాజరైన 230 మందికి ఎన్ఐఎ నోటీసులు**

కరీంనగర్,మార్చి13 : ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన మాజీ మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 230 మందికి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. గతేడాది అక్టోబరు 18 న హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. సభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఎ ఆకస్మికంగా నోటీసులు జారీ చేసింది. ఈ సభలో పాల్గొన్న కొందరు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్యలాంటి వారిపై ఇప్పటికే దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. నిషేధిత సంస్థలతో సంబంధాలు లేదా ఆ సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఈ నోటీసులు ఇచ్చారు. జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు ఈ సభలో పాల్గొనడం కూడా దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. నోటీసులు అందుకున్నవారిలో మెజారిటీ వ్యక్తులు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ముల్కనూరు, కమలాపూర్, ధర్మసాగర్, పరకాల, టేకుమట్ల, వేలేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. దశాబ్దాల క్రితమే జనజీవన స్రవంతిలో కలిసిపోయిన తమకు, ఇప్పుడు పాత సంబంధాల పేరుతో నోటీసులు రావడంపై మాజీ మావోయిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,మార్చి13 : ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రి÷-జడెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## భారతి బిల్డర్స్ సంస్థకు రూ. 4,74,17,729 కోట్ల భారీ జరిమానా

**చట్టవ్యతిరేక ప్రీ-లాంచ్ స్కీమ్ పేరుతో డబ్బు వసూలు**

**పలు నిబంధనలు ఉల్లంఘన కారణంగా డిఫాల్టర్ ప్రమోటర్‌గాప్రకటన**

**కొనుగోలుదారులకు 60 రోజుల్లో నగదు వాపసు చేయాలని ఆదేశాలు**

**ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రెరా అథారిటీ**

హైదరాబాద్,మార్చి13(ఆర్ఎన్ఎ):మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి భారతీ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ కఠిన చర్యలు తీసుకుంది. కొనుగోలుదారులు దాఖలు చేసిన ఫిర్యాదులను విచారించిన అథారిటీ, బిల్డర్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. 2021లో ప్రీ-లాంచ్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారుల నుండి భారీ మొత్తంలో నిధులు వసూలు చేసిన ప్రమోటర్, 24 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చి విఫలమయ్యారు. కనీస చట్టబద్ధమైన అనుమతులు గానీ, రెరా రిజిస్ట్రేషన్ గానీ లేకుండానే నిధులు సేకరించడం మరియు ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై అథారిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్రమంలో, ప్రాజెక్టు పూర్తి అయ్యే సూచనలు కనిపించని నేపథ్యంలో, కొనుగోలుదారులు ఆ ప్రాజెక్టులో కొనసాగాల్సిన అవసరం లేదని అథారిటీ స్పష్టం చేసింది. బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని తెలంగాణ రియల్ ఎస్టేట్ రూల్స్-2017 (రూల్ 15) ప్రకారం వడ్డీతో కలిపి 60 రోజుల్లో వాపసు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టు అభివృద్ధిలో భాగస్వాములైన మరో శ్రీ భారతి అనే సంస్థను సైతం ప్రమోటర్లుగా పరిగణిస్తూ, ఈ సంస్థలన్నీ ఉమ్మడిగా ఈ నగదును చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ వ్యవహారంలో చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 'డిఫాల్టర్ ప్రమోటర్‌గా ప్రకటించడమే కాకుండా, రూ. 3,55,63,297 భారీ జరిమానాను కూడా విధించింది. గతంలో ఇవే ఉల్లంఘనలకు సంబంధించి విధించిన రూ. 1,18,54,432 కోట్ల జరిమానాకు ఇది అదనమని పేర్కొంది.రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో 'ప్రీ-లాంచ్' ఆఫర్లు లేదా స్కీమ్‌లు చట్టం ప్రకారం పూర్తిగా నిషేధమని, అటువంటి పథకాల్లో పాల్గొనవద్దని కొనుగోలుదారులను తెలంగాణ రెరా హెచ్చరించింది. ముఖ్యంగా, రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టు నిర్మాణంలో అథారిటీ పర్యవేక్షణ ఉండదు. ఎ÷-లానింగ్ అథారిటీ వద్ద ప్రాజెక్టు విస్తీర్ణంలో 10? విస్తీర్ణాన్ని మార్టిగేజ్ (తనఖా) చేయడం ద్వారా లభించే నియంత్రణ రక్షణలు, మరియు రెరా రిజిస్టర్డ్ ప్రాజెక్టులకు వర్తించే 'ఎస్క్రో' ప్రత్యేక బ్యాంకు ఖాతా నిబంధనల వంటి ఆర్థిక భద్రతలను కూడా కొనుగోలుదారులు పొందలేరని పేర్కొన్నది.

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

**ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి**

**సకాలంలో కేంద్రానికి చేరుకోవాలన్న అధికారులు**

నిజామాబాద్,మార్చి13 : ఉమ్మడి జిల్లాలో శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థి భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే టెన్త్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 13 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగనున్న వార్షిక పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 37 వేల మంది హాజరు కానున్నారు. నిజామాబాద్ జిల్లాలో 12,244 మంది బాలురు, 12,155 మంది బాలికలు హాజరు కానున్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న 6,451 మంది బాలురు, 6,703 మంది బాలికలు కలిపి మొత్తం 13,154 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల విధానంలో ఈ సారి మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది వరకు వార్షిక పరీక్షలు ఆదివారాలు మినహా వరుసగా నిర్వహించేవారు. ఈసారి మాత్రం ఒక్కో పరీక్షకు మధ్య 3 నుంచి 5 రోజుల వరకు గడువు పెంచారు. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లిష్, 28న మ్యాథ్స్, ఏప్రిల్ 2న ఫిజిక్స్, 7న బయాలజీ, 13 సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగనున్నాయి. 15, 16 తేదీల్లో ఒకేషనల్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిమిత్తం 24 గంటల పాటు పని చేసేలా కంట్రోల్ నంబర్ (కామారెడ్డి-99596 70118, నిజామాబాద్-90302 82993) ఏర్పాటు చేశారు.పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డిఇవో తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూస్తున్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని, పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉండేది. రెండేండ్లుగా పదో తరగతి ఫలితాల్లో వెనుకబడుతున్నది. గత రెండు సంవత్సరాల నుంచి కామారెడ్డి జిల్లా మరీ దారుణంగా వెనుకబడి పోతున్నది. ఈ నేపథ్యంలో ఉభయ జిల్లాల యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.

## గ్యాస్ అక్రమ నిల్వలు స్వాధీనం

తిరుపతి,మార్చి13 : గ్యాస్ కొరత కలవరపెడుతున్న వేళ.. ఏపీలోని తిరుపతి నగర శివారులో భారీగా గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు బయటపడ్డాయి. అవిలాల పంచాయతీ పరిధిలో దాదాపు 400 గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసినట్లు సమచారం అందుకున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచల రాజు తన సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. గో గ్యాస్ పేరుతో గోదాముల్లో సిలిండర్లు నిల్వ చేసినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వైకాపా హయాంలో గో గ్యాస్ పేరుతో తిరుమలకు అక్రమంగా గ్యాస్ సరఫరా అయినట్లు గుర్తించారు. గో గ్యాస్ సంస్థకు 2019 వరకే గ్యాస్ సరఫరా అనుమతులున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## గ్యాస్ సరఫరాపై భయాందోళనకు గురి కావొద్దు

**బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కోరత లేదు**

**కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్,మార్చి13 అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు సుపత్రిలకు,విద్యాసంస్థలకు,వృద్దాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్టిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.

# సంపాదకీయం

## రాహుల్..అపరిపక్వ విపక్షనేత!

భారత ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే బురదజల్లే నేత అని అర్థం రూఢి అవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా విపక్షంలో ఉన్నవారు నాలుగు రాళ్లు వేయడం, ఇంత బురద జల్లడం, ప్రభుత్వం ఏం చెబుతుందో తెలుసుకోకుండానే సభనుంచి నిష్క్రమించడం పరిపాటిగా మారింది. సరిగ్గా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఇప్పుడు అదే పాత్రలో ఒదిగి పోయారు. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచమంతా వణుకుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ బలంతో ఇరాన్‌ను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచంలోని మారుమూల పల్లె కూడా ప్రభావితం అవుతోంది. మనవద్ద గ్యాస్, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నాం. ఇదేమీ మోడీ తెచ్చుకున్న విపత్తు కాదు. లేదా కావాలని కోరుకున్నదీ కాదు. అధికారంలో కాంగ్రెస్ ఉండివుంటే ఇంతకన్నా దారుణంగా ఉండేది. ఎందుకంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాతనే క్రూడాయిల్ దిగుమతి పెరిగింది. ఇంధన సామర్థ్యం పెరిగింది. దేశంలో రిఫనరీల సామర్థ్యం పెంచి వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదగింది. గ్యాస్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మారుమూల పల్లెలకు సైతం గ్యాస్ చేరుతోంది. ఇతర దేశాలకు కూడా ఇంధనం సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదిగింది. వివిధ దేశాలతో సత్సంబంధాలే ఇందుకు నిదర్శనం. ఇంత సంక్షోభంలోనూ ఇరాన్ మనపట్ల సానుకూలంగా ఉందంటే, మనం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. రాహుల్ చెప్పటినట్లు నడుచుకుంటే దేశం ఏనాడో భ్రష్టు పట్టిపోయేది. ఇకపోతే ఈ సంక్షోభంలోనూ మనం బంగ్లాదేశ్‌కు ఇంధనం సరఫరా చేయగలి గాం. అయితే ఇవేవీ గమనించకుండా పార్లమెంటులో రాహుల్ చేసిన ప్రసంగం చిన్నపిల్లవాడికన్నా అధ్వాన్నంగా ఉంది. విపక్షనేతకు సమస్యలు, పరిస్థితులు తెలిసి ఉండాలి. కానీ దేశంలో ప్రస్తుతం నెలకొన్న వంట గ్యాస్ కొరతకు, ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు ఉండడానికి సంబంధం ఉందంటూ విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో గురువారం చేసిన ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. రాజకీయ పరిపక్వత లేని నేత విపక్ష నేతగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పశ్చిమాసియా లో జరుగుతున్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. అయినా కేంద్రం దానిని మానిటర్ చేస్తోంది. ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీ పడినందువల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ చేసిన విమర్శలు దేశం పట్ల ఆయనకున్న అవగాహన ఇదేనని అర్థం చేసుకోవాలి. దేశ ఇంధన అవసరాలపై అమెరికా ఆంక్షలు విధించే స్థితికి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మనం ఆయిల్‌ను ఎవరి నుంచి కొనుగోలు చేయాలి, గ్యాస్‌ను ఎక్కడి నుంచి తీసుకురావాలి అన్న నిర్ణయాలను అమెరికాకు విడిచిపెట్టాం అనడంలో అర్థం లేదు. విదేశాల నుంచి వాణిజ్యానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. రష్యా నుంచి ఆయిల్ కొనాలా, వద్దా అన్నది కూడా వాణిజ్య ఒపపందాలకు ముడిపడి ఉన్న అంశం. ఈ మాత్రం తెలియని వ్యక్తి విపక్ష నేతగా ఎలా ఉంటున్నారో ప్రజలు తెలుసుకోవాలి. ఇకపోతే మాట్లాడేదంతా మాట్లాడిన అన్నా చెల్లెళ్లు రాహుల్, ప్రియాంకలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే వరకు వేచి చూడకుండా సభ నుంచి నిష్క్రమించారు. ఇది చాలు..వారు ఎంత చిత్తశుద్ధిగా ఉన్నారో తెలియడానికి. బయటకు వెళ్లి ధర్నాలు చేయడం తప్ప రాహుల్‌కు తెలిసిందేమీ లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇరాన్ మన దేశం పట్ల చాలా సానుకూలంగా ఉండడంతో తొలి చమురు నౌక భారత్ చేరుకోగలిగింది. అలాగే రష్యా నుంచి మనం ఇంధన దిగుమతులకు అమెరికా తలూపింది. ఇవన్నీ కూడా విదేశాంగ నీతిలో ఓ భాగం. ఇకపోతే ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అందువల్ల దేశంలో ఉన్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై తీవ్రంగానే స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హోర్ముజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయాలని ఆదేశించారు. ఇంత జరుగుతున్న ట్రంప్ ఇంకా తన వంకర బుద్ధిని మార్చుకోవడం లేదు. ముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గాన్ని బయటపెడుతున్నాయి. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా కృతనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్ధవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగుతాయని ఆయన అన్నారు. అయితే తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుం దంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తిప్పికొట్టింది. యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోవాల్సింది తామేనని స్పష్టం చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు మూడు షరతులు విధించింది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని, నష్టపరిహారం చెల్లించా లని, భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు జరగకుండా అంతర్జాతీయ సమాజం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆ మూడు షరతులు నెరవేరుస్తామని హామీ ఇస్తేనే యుద్ధాన్ని ముగిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందువల్ల ఇప్పట్లో అ కుంపటి చల్లారదని తెలిపోయింది. మనవరకు మనం ఇంధన అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం. దేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హర్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. ఇంకా ఇలాంటి ప్రయత్నాలు ఉండనున్నాయి. ఇది ఓ రకంగా మనం అనుసరిస్తున్న విదేశాంగ విధాన విజయానికి సూచిక.

# ఎన్నికల ముందు 'సర్' ప్రకంపనలు



పశ్చిమబెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ (ఎస్‌ఐఆర్)ను ఎన్నికల కమిషన్ చేపట్టిన తరువాత అనేక అవకతవకలు ఉన్నాయని దాదాపు 63 లక్షలమంది జాబితాలనుంచి తొలగించబడ్డారు. దీనిపై భారీ ఎత్తున ఓటర్ల నుంచి ఆందోళనలు లేచాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ సమస్యను తానే చేపట్టి సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిన్నమొన్నటివరకు దీనిపై ధర్నా కూడా సాగించారు. ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా వచ్చే పిటిషన్లను విచారించడానికి సుప్రీం కోర్టు అపిల్లేట్ ప్యానెళ్లను ఏర్పాటు చేయించింది. ఈ ప్యానెళ్లను నిర్వహించడానికి హైకోర్టు మాజీ జడ్జీల సేవలను వినియోగించుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఫిబ్రవరి 28న ఓటర్ల తుది జాబితాల నుంచి 63 లక్షలమంది తొలగించబడగా, 10 లక్షలమంది నుంచి మాత్రమే ఫిర్యాదులు వచ్చాయి. ఈ 10 లక్షల ఫిర్యాదులను రెండు నెలల్లో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందే అపిల్లేట్ ప్యానెళ్లు పరిశీలించడం పూర్తవుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఫిర్యాదులను పైపైన పరిశీలించినా సరే నిర్ణయం తీసుకోవడానికి తగినంత సమయం పడుతుందని ఎవరైనా విశ్వసిస్తారు. ఈ వ్యవస్థను పటిష్టం చేయడానికి సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్ కలిసి ఎక్కువ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది జడ్జీలను అభ్యర్థించినా, చాలా సమయమే పడుతుందని అంచనా వేస్తున్నారు. ముక్తసరిగా చెప్పాలంటే ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్ పరుగుపందెం వేసుకున్నా సమయం తక్కువగా ఉండడంతో పూర్తి అవుతుందో లేదో చెప్పలేం. ఈ పరిస్థితిలో ఈ ప్రక్రియను ఎలాగైనా పూర్తి చేయాలన్న అత్యుత్సాహం ఎందుకు? రూఢిగా చెప్పాలంటే ఇలాంటి ఈ జాబితాల సవరణ పూర్తయిన తరువాతనే ఓటింగ్ నిర్వహించాలని కచ్చితంగా నిర్ధారించే చట్టం ఏదీ లేదు. అప్పెల్లెట్ లేదా ఎన్నికల కమిషన్ తీర్పు ప్రకారం గుర్తింపు పొందిన వారికే ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఓటర్ల జాబితాలో అన్ని ఎంట్రీలను కలిగి ఉన్న, మంజూరు చేయబడిన పత్రం తప్పనిసరి అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేస్తోంది. అది కూడా ఈ దేశానికి చెందిన చట్టబద్ధమైన పౌరులై ఉండాలని వివరించింది. దీనిని ఏ రాజకీయ పార్టీ లేదా పౌరుడు లేదా కోర్టులు కూడా కాదనలేరు. నిజానికి ఇప్పుడు లేవదీస్తున్న అభ్యంతరాలు గతంలో ఎప్పుడూ లేవదీయడం జరగలేదు. ఓటర్లకు పెద్దగా ఎలాంటి ఆటంకాలు ఎదురు కాలేదు. ఈ సందర్భంగా గ్రీకు గణిత శాస్త్ర పండితుడు యూక్లిడ్ ఆనాడు ఈజిప్టు రాజు ఒకటో టోలెమీతో ఏమన్నారో ఇక్కడ ప్రస్తావించ వలసి ఉంది. ఏదేమైనా రేఖాగణితం నేర్చుకోవడానికి రాజమార్గం అంటూ ఏదీ లేదని యూక్లిడ్ నిష్కర్షగా ప్రకటించారు. అదే విధంగా ఇప్పుడు సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్ పౌరులు ఓటు వేసేలా హక్కు కల్పించడమే ముఖ్యం తప్ప విధానాలు వెతకడం అనవసర కాలయాపనే అవుతుంది. సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్, అపిల్లేట్ వ్యవస్థలు ఇవన్నీ పౌరుల అత్యంత పవిత్రమైన ఓటు హక్కును కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి రాజమార్గం అంటూ ఏదీ లేదని గమనించాలి. అయితే ఈ ప్రక్రియలో పౌరులకు న్యాయం జరగడానికి కొంత సమయం తీసుకుంటుంది. అందువల్ల ఎవరైనా ఓర్పుగా ఉండడం అవసరం. ఎన్నికల కమిషన్ లేదా సుప్రీం కోర్టు తదితర సంస్థల్లో ఎవరు ఉన్నత స్థానాల్లో కూర్చున్నా వారి కర్తవ్యం ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించడమే. ఎవరి ఓటు హక్కునూ అణగదొక్కే అధికారం ఎవరికీ లేదు. ఆ సాధనలో అడ్డుగా నిలబడే హక్కు ఎవరికీ లేదు. అందుకే అర్హులైన ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.ఓటు హక్కు లేకుంటే ఎవరైనా చనిపోయినట్టే భావిస్తుంటారు. అలాంటి పరిస్థితి కలగకూడదు. పశ్చిమబెంగాల్‌లో 60 లక్షల మంది జాబితానుంచి అదృశ్యం కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 7.04 కోట్ల మందే ఓటర్లు నికరంగా తేలారని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. అందుకనే జాబితాలో లేని వారు న్యాయపరిధిలో ఉన్నట్టు పరిగణించి వారి వినతులను పరిష్కరించడానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు ఏర్పడుతున్నాయి. ౹ాశ్రీంశీ =ముం - బెడిసికొడుతున్న ట్రంప్ వ్యూహాలు ఈ ప్రక్రియ ముగిశాకనే బెంగాల్‌లో ఎన్నికలు జరుగుతాయా లేక ముందే పూర్తి అవుతాయా అన్నది చెప్పలేకపోతున్నారు. ఇదిలా ఉండగా చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార బిజెపికే కొమ్ము కాస్తున్నారని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఆ పదవి నుంచి తొలగించాలనే తీర్మానాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్ట డానికి రంగం సిద్ధం చేస్తున్నాయి. సిఇసి అభిశంసనకు లోక్‌సభ స్పీకర్ మాదిరిగానే లోక్‌సభలో నోటీసు ఇవ్వడానికి కనీసం 100 మంది సభ్యులు, రాజ్యసభలో 50 మంది సభ్యులు సంతకాలు చేయాలి. సుమారు 120 మంది లోక్‌సభ సభ్యులు, 60 మంది రాజ్యసభ సభ్యుల నుంచి సంతకాలు సేకరించాయని తెలుస్తోంది. సిఇసిపై పార్లమెంట్‌లో అవిశ్వాసం నోటీస్ ఇవ్వడం ఇదే తొలిసారి అవుతుంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్,మార్చి13 : దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. గురువారంతో పోలిస్తే నేశుక్రవారం నాటి మార్కెట్లలో గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంకాస్త దిగొచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో బంగారం, వెండి రేట్లను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధరపై రూ.980 పతనమై రూ.1,61,240కు చేరగా.. 22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.900 తగ్గి రూ.1,47,800 వద్ద ట్రేడవుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. క్రితం రోజుతో పోలిస్తే కిలో వెండిపై రూ.100 తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,79,900గా ఉంది. అయితే.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమే ధరల తగ్గుదలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఉద్దానం బాధితులకు ఊరట

### అందుబాటులోకి పలాస కిడ్నీ సెంటర్

శ్రీకాకుళం,మార్చి13 : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవెరబోతోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలాసలో చారిత్రాత్మక అడుగు వేసింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా, తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆపరేషన్‌ని నిర్వహించనున్నారు. దేశంలోని ప్రముఖ కిడ్నీ మార్పిడి నిపుణులు ప్రత్యేకంగా పలాసకు విచ్చేసి స్థానిక వైద్యులతో కలిసి ఈ క్లిష్టమైన పక్రియను విజయవంతంగా పూర్తి చేయనున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆంధప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది. పలాస సెంటర్ అభివృద్ధికి రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసి, ఆపరేషన్ థియేటర్ల ఆధునికీకరణ, డయాలసిస్ యూనిట్లు, పోస్ట్ - ఆపరేటివ్ కేర్ సెంటర్లను బలోపేతం చేసింది. పేద రోగులకు ఎక్కువ ఖర్చుతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పొందే కిడ్నీ మార్పిడి చికిత్సను పలాస కేంద్రంలోనే ప్రభుత్వం బాధ్యతగా నిర్వహిస్తోంది. గతంలో కిడ్నీ సమస్యల చికిత్స కోసం ఉద్దానం వాసులు విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లేవారు. ఇప్పుడు పలాసలోనే ఈ సదుపాయం రావడం వల్ల ప్రయాణ భారం తగ్గుతోండటంతో పాటు అత్యవసర సందర్భాల్లో ప్రాణాలు కాపాడే అవకాశాలు మెరుగుపడతాయి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా నిరంతరం స్క్రీనింగ్ పరీక్షలు, మందుల పంపిణీ జరుగుతుంది.

## కూలిన అమెరికా ఈఫ్యూయలింగ్ విమానం

### ఇరాక్‌లో కూలినట్లు ప్రకటించిన అమెరికా

### తామే కూల్చామన్న ఇరాక్ రెబల్స్..తోసిపుచ్చిన అగ్రరాజ్యం

వాషింగ్టన్,మార్చి13 : అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్‌లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు. ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.


## చందానగర్ ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

### కాలి బూడిదైన ఫర్నీచర్ సామాన్లు

హైదరాబాద్,మార్చి13 : నగరంలోని చందానగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని ఐదు అంతస్తుల్లో నిల్వ చేసిన ఫర్నిచర్ మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది. 7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణం ఐదు అంతస్తుల భవనంలో ఉండటం, లోపల సోఫాలు, బెడ్‌లు, టేబుల్స్ తదితరాలు ఉండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి కారణం ఏంటనేది తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ లేదా ఇతర కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు సంయుక్తంగా ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్నారు.ఈ ప్రమాదం కారణంగా చందానగర్ ప్రాంతంలో కొంత వరకూ సేవలకు అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కనిపించని శక్తి దేవుడు

తిరుమల : దేవుడు విద్యుచ్ఛక్తి లాంటివాడు. విద్యుత్తును ఒకసారి చూపమని అడిగితే ఎవరూ చూపించలేరు. విశాల విశ్వంలో సంభవించే నిరంతర పరిణామాలకు కారణ మవుతున్నది, మనిషి మేధ అందుకోలేకపోతున్న అజ్ఞాతశక్తి- ఒకటే. గాలిలోని ప్రాణవాయువు జీవి కళ్లకు కనపడనంత మాత్రాన లేకుండా పోదు. దాన్ని జీవశక్తిగా నమ్ముతున్నప్పుడు జీవులకు ప్రాణం పోస్తున్న ఆ శక్తిని దేవుడనడానికి అభ్యంతరం ఉండకూడదు.దేవుడు లేడనేవారి మనోభావనలను నిరసించి గాయపరచడాన్ని హైందవ సనాతన ధర్మం ఎన్నడూ ఆమోదించలేదు. ఉన్నాడని చెప్పేందుకు తార్కిక వాదనలను వినిపించింది. దేవుడంటే ఎవరేది చెప్పినా వినగల సహనం నేర్పించింది. చార్వాకుడి నాస్తిక వాదాన్ని కించపరచలేదు. ఋషులకిచ్చిన గౌరవమే ఆయనకు ఇచ్చింది.విశ్వమంతా నిండి ఉన్న చైతన్యమంతా దేవుడేనని, అతడు రూపగుణ విశేషాలుండని తనలోనే ఉన్న దివ్య చైతన్యమని, అందులో తానొక అణువులో అణుమాత్రమైనా కాని అంశమని వేదాంతం తెలుసుకొమ్మంటుంది. వేదాంతం అర్థమైతే... దేవుడంటే వెలుగని గ్రహించి- భౌతిక లోకంలో చీకట్లు తనను ఏ రూపంలో వేధిస్తున్నా మనిషి భయపడడు!



ఆధ్యాత్మికం

## వాట్సప్‌చాట్ ఆధారంగా విడాకులు మంజూరు చేయలేం



ముంబయి : జీవితభాగస్వామికి ఖండించే అవకాశం కూడా లేకుండా కేవలం వాట్సప్‌చాట్‌ల్లో క్రూరత్వం ఆధారంగా విడాకులు మంజూరు చేయలేమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ, హైకోర్టును ఆశ్రయించిన మహిళ పిటిషన్‌పై ధర్మాసనం పైవిధంగా స్పందించింది. తన వాదనను వినిపించేందుకు లేదా వ్యతిరేకించేందుకు తనకు అవకాశం ఇవ్వలేదని ఆ మహిళ పిటిషన్‌లో పేర్కొంది. భర్త సమర్పించిన సాక్ష్యాలను (వాట్సప్ చాట్‌లను) తోసిపుచ్చడానికి భార్యకు అవకాశం ఇవ్వడంలో కుటుంబకోర్టు విఫలమైందని జస్టిస్ భారతి దాంగ్రే, జస్టిస్ మంజుషా దేశ్ పాండేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేవలం వాట్సప్ చాట్ మీద ఆధారపడి, విడాకులను మంజూరు చేయలేమని నాసిక్ జిల్లా కుటుంబ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను గతవారం ధర్మాసనం కొట్టివేసిన సంగతి తెలిసిందే. భార్య వాదనలు వినిపించడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి అవకాశం కల్పించడానికి ఈ కేసును తిరిగి కుటుంబ కోర్టుకు అప్పగించాలని ధర్మాసనం ఆదేశించింది. మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరించేందుకు గత అవకాశాలను కూడా పరిశీలించాలని ధర్మాసనం పేర్కొంది. విడాకులు కోరుతూ మహిళ భర్త తమ వాట్సప్ చాట్‌ను కుటుంబ కోర్టుకు సమర్పించారు. మహిళ తమ నివాసాన్ని నాసిక్ నుండి పూణెకు మార్చాలని, విడిగా ఉండాలని డిమాండ్ చేసిందని పేర్కొన్నారు. ఆమె తన అత్తగారు మరియు వదినపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. ఆ మహిళ తన వాట్సప్ చాట్‌లో భర్తపై ఒత్తిడి తీసుకువచ్చిందని, భావోద్వేగంతో బ్లాక్‌మెయిల్ చేసిందని, అసభ్యకరమైన భాషను వినియోగించిందని .. దీంతో భర్తపై క్రూరత్వం చూపినందున అతను విడాకులకు అర్హుడని కుటుంబ కోర్టు తీర్పునిచ్చింది.ం

## క్రియాశీల రాజకీయాల్లోకి నితీష్ కుమారుడు



పాట్నా : బీహార్ సీఎం నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ త్వరలో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే అవకాశముందని పార్టీ సీనియర్ నేత, మంత్రి శ్రావణ్ కుమార్ తెలిపారు. "హోలీ సందర్భంగా నిశాంత్ త్వరలో రాజకీయాల్లోకి రానున్నారు" అని ఆయన మీడియాకు చెప్పారు. అధికార ఎన్డీఏ మిత్రపక్షమైన జనతాదళ్ (యునైటెడ్) నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 9న ముగియనుంది. వీరిలో రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ ఉన్నారు. మార్చి 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు మార్చి 5 నామినేషన్ల గడువు నేపథ్యంలో మంత్రి శ్రావణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్ నుంచి మొత్తం 16 రాజ్యసభ స్థానాల్లో ఐదు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వీటిలో జేడీయూ నుంచి ఇద్దరు, మిత్రపక్షం రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) చీఫ్ ఉపేంద్ర కుష్వాహా ఒకరు, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతా దళ్ నుంచి ప్రేమ్ చంద్ గుప్తా, అమరేంద్ర ధరి సింగ్ పదవీకాలం ముగుస్తోంది. 243 సభ్యుల అసెంబ్లీలో 202 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ఎన్డీఏ సులభంగా నాలుగు స్థానాలు గెలుచుకునే స్థితిలో ఉంది. ఐదో స్థానంపై ఎన్డీఏ, మహాఘటబంధన్ మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. జేడీయూ నుంచి నిశాంత్ కుమార్ పేరుతో పాటు రామ్ నాథ్ ఠాకూర్ పేరు కూడా చర్చల్లో ఉంది. అయితే హరివంశ్ నారాయణ్ సింగ్‌కు ఈసారి అవకాశం దక్కకపోవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ం

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



పశ్చిమాసియా : పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని ఏ నౌక దాటాలని చూసినా నిప్పుపెడతామని ఇరాన్ చేసిన హెచ్చరికలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలు రానున్న రోజుల్లో దేశీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియని అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. దీంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 1,700 పాయింట్ల మేర క్షీణించింది. నిఫ్టీ 24,400 దిగువన కదలాడుతోంది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 1,670 పాయింట్ల మేర పతనమై 78,565 వద్ద ఉంది. నిఫ్టీ 513 పాయింట్లు కోల్పోయి 24,351 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. లార్సెన్, టాటా స్టీల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి. దక్షిణ కొరియా కొస్పి 12 శాతం మేర పడిపోయింది. దాంతో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా.. భారత్ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలై ఐదు రోజులు అవుతుండగా.. ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యుద్ధం తీవ్రమవుతుండటంతో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మదుపర్లను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. భారత్‌లో ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై ఈ ప్రభావం గురించి ఆందోళనలు నెలకొన్నాయి. యుద్ధం ముదురుతూ ఉంటే.. వాణిజ్యలోటు పెరుగుతుందని, రూపాయి బలహీనపడుతుందని, కార్పొరేట్ ఆదాయాలపై ఒత్తిడి ఉంటుందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో లార్సెన్ అండ్ టర్బో స్టాక్ 7 శాతం మేర కుంగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 3.5 శాతం క్షీణించింది. వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి, జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి, ఏకంగా 92.18 మార్క్‌ను తాకింది.ం

## ఉపాధి పథకాన్ని రద్దు చేసే కుట్ర బిజెపి చేస్తుంది



చీరాల (బాపట్ల) : పేదలకు అనుకూలంగా ఉపాధిపరంగా ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేస్తుంది అని రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విమర్శించారు. బుధవారం ఇంకొల్లు సినిమా హాల్ సెంటర్ లో ఉపాధి హామీ పథకం గురించి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సభలో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు పలువురితో ముందుగా వారి అభిప్రాయాలన్ని బహిరంగంగా తెలిపారు. సభలో వారు చెప్పిన సమస్యలు విన్న అనంతరం షర్మిలా మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ .... కాంగ్రెస్ హయాంలో పేదల కోసం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర కొనసాగిస్తుందని విమర్శించారు. అందులో భాగంగా ముందుగా మహాత్ముని పేరు తొలగించి విబి జి రాంజీ ఉపాధి హామీ పథకం అని నామకరణం చేశారన్నారు. తదుపరి ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే విధంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పొడిగించామన్నారు. గతంలో వందరోజులకే పని కల్పించిన ఈ పథకాన్ని పేరుకు 125 రోజులు పని దినాలు కల్పించాము అని చెబుతున్నప్పటికీ అందులో చిత్తశుద్ధి లేదన్నారు. గతంలో గ్రామంలో పేద ప్రజలే తమకు పనిలేదని ఉపాధి కోసం గ్రామంలో పెద్దలను అధికారులను సంప్రదిస్తే వారికి ఉపాధి చూపించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించేవారన్నారు. అయితే ప్రస్తుత నూతన విధానంతో అందుకు అవకాశం లేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఎంతో మంచి గొప్ప పథకాన్ని తొలగించే ప్రయత్నం బిజెపి చేస్తుందని అన్నారు. పథకాన్ని గుండు సున్నా చుట్టేలా చేస్తుందన్నారు. ఇది బిజెపికి డబ్బులు వచ్చే పథకం కాదని అందువలన తొలగించారని అన్నారు.

# భారీ జీతంతో సమ్మతృప్తే!

### ఐటీ జాబ్ మార్కెట్లో భిన్నమైన పరిస్థితి ఆసక్తి కలిగిస్తున్న 'బ్లైండ్'యాప్ నివేదిక




భారీ జీతం అందుకోవాలి. వృత్తిపరంగా ఎదగాలి. ప్రపంచస్థాయిలో గుర్తింపు రావాలి. ఇదీ ఓ సగటు భారతీయ టెకీ మనసులో మాట. ఇందుకోసం అంతర్జాతీయ దిగ్గజ టెక్ కంపెనీల్లో పనిచేయాలని ఆకాంక్షిస్తుంటారు. అయితే అధిక వేతనం ఎల్లప్పుడూ పని ప్రదేశంలో సంతృప్తిని, వృత్తిపరమైన ఎదుగుదలను అందించలేదని ఒక నివేదిక వెల్లడించింది. ప్రధాన సంస్థలలో పని వాతావరణాన్ని అంచనా వేయడానికి 40,686 మంది ఉద్యోగుల రేటింగ్స్, జీతాల డేటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ కమ్యూనిటీ యాప్ 'బ్లైండ్'ఓ నివేదికను రూపొందించింది. పని ప్రదేశంలో సంతృప్తి, వృత్తిపరమైన ఎదుగుదల అవకాశాలు, మేనేజ్‌మెంట్ పనితీరును విశ్లేంచింది. మన దేశంలో టెకీలు కోరుకుంటున్న ప్రధాన కంపెనీల జాబితా ఒకటైతే.. భారత్‌లో పనిచేయడానికి ఉత్తమ సంస్థలుగా పేరొందిన సంస్థల జాబితా వేర్వేరుగా ఉండటం ఆసక్తికరం.

**భారీ వేతనం ఉంటే..**

పోటీతత్వంతో కూడిన నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన పని ప్రదేశాన్ని ఎంచుకోవడం మునుపటి కంటే ఇప్పుడు చాలా కీలకంగా మారింది. చాలామంది నిపుణులు కేవలం జీతంపైనే కాకుండా వృత్తిపరమైన ఎదుగుదల, పని సంస్కృతి, దీర్ఘకాలిక స్థిరత్వంపై కూడా దృష్టి సారిస్తున్నారు. పని--జీవిత సమతుల్యత ఉద్యోగుల సంతోషాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని తేలింది. కెరీర్‌ను మార్చుకోవాలనుకునే నిపుణులకు జీతం ఇప్పటికీ ప్రధాన ఆకర్షణగా ఉంది. అంటే భారీ వేతనం ఉంటే కెరీర్ మారేందుకు సిద్ధం అన్నమాట.

**టాప్--15లో లేవు..**

భారత్‌లో టెకీలు, జాబ్ మార్కెట్లోకి అడుగుపెట్టేవారు అత్యధికంగా కోరుకునే సంస్థల జాబితాను బ్లైండ్ రూపొందించింది. ఇందులో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అట్లాసియన్, ఫ్లిప్‌కార్ట్, జీటా, ఇన్‌మోబి, టెకియన్ కార్ప్, ఉబర్, వాల్‌మార్ట్, సేల్స్‌ఫోర్స్, ఎడోబ్, మెటా, ఒరాకిల్, షేర్‌చాట్ ముందు వరుసలో ఉన్నాయి. బ్లైండ్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ జాబితాలో అత్యుత్తమ రేటింగ్ పొందిన టాప్--10 కంపెనీల్లో ఎన్విడియా, గూగుల్, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్, వీఎమ్‌వేర్, ఎడోబ్, టార్గెట్, క్రెడ్, నోకియా, థాట్‌వర్క్స్ ఉన్నాయి. గూగుల్, ఎడోబ్ మాత్రమే ఈ రెండు జాబితాల్లోనూ నిలిచాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి భారీ వేతనాలు ఇచ్చే కంపెనీలు టాప్--15 బెస్ట్ వర్క్‌ప్లేసెస్‌లో చోటు సంపాదించుకోలేకపోయాయి. ఎన్విడియా, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్ వంటి అత్యుత్తమ రేటింగ్ పొందిన సంస్థలకు అత్యధికంగా కోరుకునే కంపెనీల జాబితాలో స్థానం దక్కలేదు.

**ఉద్యోగుల సెంటిమెంట్..**

అధిక జీతాలు ఎల్లప్పుడూ ఉద్యోగ సంతృప్తితో సంబంధం కలిగి ఉండవని ఈ అధ్యయనం ద్వారా వెల్లడైంది. అత్యధిక జీతాలు ఇచ్చే కంపెనీలలో మూడో వంతు కంటే తక్కువ మాత్రమే అత్యుత్తమ రేటింగ్ పొందిన పని ప్రదేశాల జాబితాలో ఉన్నాయి. ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రతిభను ఆకర్షించినప్పటికీ ఉద్యోగులను నిలుపుకోవడంలో, వారిని ఉత్సాహపరచడంలో పని సంస్కృతి, నాయకత్వం కీలక పాత్ర పోషిస్తాయని నిరూపితమైంది. ఉద్యోగుల సంతృప్తి అనేది కేవలం జీతంపై మాత్రమే కాకుండా ఇతర అంశాలపై ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగి ఏదేని కంపెనీలో దీర్ఘకాలం కొనసాగాలంటే నాయకత్వ నాణ్యత, వృత్తిపరమైన అభివృద్ధి, పని సంస్కృతి ఇప్పటికీ కీలకమైనవి. ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు సహాయక వాతావరణాన్ని సమతుల్యం చేసే సంస్థలు మాత్రమే నైపుణ్యం కలిగిన నిపుణులను నిలుపుకోగలవు, బలమైన ఖ్యాతిని నిర్మించుకోగలవని తెలిపింది.

**ఏడాదిలో భారత్‌లోని నిపుణులు వెతికిన కంపెనీలు, పదాలు...**

అత్యధికంగా వెతికిన కంపెనీల పేర్లు: మైక్రోసాఫ్ట్, గూగుల్, ఉబర్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, మెటా, అట్లాసియన్, యాపిల్, క్వాల్‌కామ్, ఈబే. తరచూ సెర్చ్ చేసిన పదాలు: లేఆఫ్, ఆఫర్, హెచ్--1బీ, మెటా ఇండియా, గూగుల్ ఇండియా, మెటా లండన్.

# చందమామ చిక్కేదెవరికి?

దశాబ్దాల తర్వాత జాబిల్లిపై అమెరికా దృష్టిసారించిన మరుక్షణమే చైనా సైతం తన అంతరిక్ష పరిశోధనలకు చందమామను కేంద్రస్థానంగా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రాకెట్లు, వ్యోమనౌకలు, ల్యాండర్‌లతో రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. 2028కల్లా చంద్రునిపై 'ఆర్టిమిస్ ప్రోగ్రామ్'ద్వారా మానవసహిత ప్రయోగాలను పునరుద్ధరించాలని అమెరికా ప్రణాళికలు రచించింది. ప్రతిరంగంలో అమెరికాతో పోల్చుకుని ఆ దిశగా పావులు కదిపే చైనా ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అంతరిక్ష వనరులు, దేశ ప్రయోజనాలే పరమావధిగా ముందడుగు వేస్తోంది. దీంతో ఒక్కసారిగా చంద్రుని కేంద్రంగా అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పోటీకి తెరలేచింది.

చైనా ఎలా సంసిద్ధమవుతోంది?

మానవసహిత ప్రయాణాలు సాధ్యమయ్యేలా అత్యంత శక్తివంతమైన లాంగ్ మార్చ్--10 రాకెట్‌ను చైనా అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన తక్కువ కాలానికి ఇంజిన్‌ను పూర్తి లేదా పాక్షిక సామర్థ్యంతో మండించడం(క్రిటికల్ స్టాటిక్ ఫైర్), ప్రయోగశాలలో రాకెట్ సామర్థ్యాన్ని పరీక్షించడం(లో ఆతి?టట్యూట్ డెమోన్?రస్టేషన్ టెస్ట్)లను విజయవంతంగా పూర్తిచేసింది. వ్యోమగాములను మోసుకెళ్లే పునర్ వినియోగ క్యాపరీ?స్యల్ 'ది మెంగ్‌జోయూ'ను చైనా పరీక్షిస్తోంది. ఈ క్యాప్సూల్‌తో డైనమిక్ ప్రెషర్ విధానంలో వ్యోమగాములు తప్పించుకునే టెస్ట్‌ను విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగవేదిక నుంచి వ్యోమనౌక గాల్లోకి లేచేటప్పుడు హఠాత్తుగా అగ్నిప్రమాదం లాంటివి జరిగితే వ్యోమగాములు తప్పించుకునే మ్యాక్స్ క్యూ అబోర్ట్ టెస్ట్‌నూ విజయవంతంగా పరీక్షించింది. చైనా వ్యోమగాములు(టైకోనాట్స్)ను చందమామ ఉపరితలం మీదకు తీసుకెళ్లే తిరిగి కక్ష్యలోకి తీసుకొచ్చే 'ది లాన్యే లూనార్'ల్యాండర్‌నూ చైనా పరీక్షిస్తోంది. లాన్యే అంటే చందమామను హత్తుకోవడం. ఈ పదాన్ని మావో జెడాంగ్ తన కవితలో తొలిసారిగా ఉపయోగించారు. సిమ్యులేషన్ సమయంలో ఈ ల్యాండర్.. ల్యాండింగ్, టేకాఫ్‌లను అత్యంత ఖచ్చితత్వంతో పూర్తిచేసిందని చైనా ఇటీవలే ప్రకటించింది. చందమామపైకి లాంగ్ మార్చ్--10 రాకెట్ పలు మార్లు ప్రయోగాలకు అనువుగా ప్రయోగవేదికలను విస్తరిస్తున్నారు. లాంచ్‌ప్యాడ్లు, ట్రాకింగ్ స్టేషన్లు, అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో హైనాన్‌లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్‌సైట్‌లో నిర్మాణపనులు వేగవంతమయ్యాయి. వ్యోమగా ములతో కూడిన డీప్--స్పేస్ ఆపరేషన్ల కోసం ఇతర కీలక వసతులను అందుబాటులోకి



తెస్తున్నారు.

చందమామ మీదకు వెళ్లేది ఎప్పుడు?

మరో నాలుగేళ్లలో తొలి వ్యోమగాముల బృందాన్ని చందమామ మీద దింపాలని చైనా లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు సంబంధించిన పనులన్నీ షెడ్యూల్ ప్రకారం చకచకా జరుగుతున్నాయని 'ది చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ'ప్రకటించింది. "ప్రయోగ పరీక్షలు అన్నీ విజయవంతమవుతూ, మౌలికసదుపాయాల కల్పన పూర్తవుతూ లక్ష్యాన్ని చేరువచేస్తున్నాయి. అంతరిక్ష చరిత్రలో సరికొత్త మైలురాయిని త్వరలో చేరుకోబోతున్నాం"అని స్పేస్ ఏజెన్సీ పేర్కొంది.

ఈ ఏడాది బిజీబిజీ..

2026లో బిజీ షెడ్యూల్‌తో చైనా దూసుకుపోతోంది. సొంతంగా నిర్మించుకున్న అంతరిక్ష కేంద్రం 'తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్'కు రెండు సార్లు వ్యోమగాములను పంపనుంది. సరకులను పంపేందుకు ఒక ప్రయోగం చేయనుంది. ఒక టైకోనాట్‌ను ఒక పూర్తి ఏడాదికాలం అక్కడే ఉంచనుంది. తద్వారా సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉంటే ఎలాంటి అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావొచ్చు? అనే అంశంపై అధ్యయనంచేయనుంది. కొత్త మాడ్యూళ్లను తీసుకెళ్లేందుకు హాంకాంగ్, మకావూ నుంచి ఇద్దరు టైకోనాట్స్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపనుంది. పాకిస్తాన్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల వ్యోమగాములకు చైనా స్పేస్‌స్టేషన్ స్వాగతం పలకనుంది.

నాసా మిషన్‌లో వచి?చన మార్పులేంటి?

2027లో దిగువ కక్ష్యలో తొలుత ఒక వ్యోమనౌకను ప్రయోగించనుంది. వాణిజ్య ల్ష?ంయదర్లతో అనుసంధానం కోసం రిహార్సల్ చేయనుంది. ఈ కమర్షియల్ ల్యాండర్లను స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు రూపొందిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఆర్టిమిస్--2 ప్రాజెక్ట్‌ను అమెరికా చేపట్టనుంది. వ్యోమగాములతో బయల్దేరే వ్యోమనౌక చంద్రుని సమీప కక్ష్యలోకి వెళ్లి అక్కడి నుంచి జాబిలి సమాచారాన్ని సేకరిస్తుంది. చంద్రుని స్వల్ప గురుత్వాకర్షణ శక్తినే వడిసెలా వాడుకుని తిరిగి భూమి దిశలో పయనించనుంది. 2027లో ఆర్టిమిస్--3 ఆ తర్వాత 2028లో ఆర్టిమిస్--4ను అమలుచేయనుంది.

మళ్లీ చందమామపై దృష్టి ఎందుకు సారించారు?

చంద్రుని దక్షిణ ధృవంలోని బిలాల్లో ఘనరూప నీరు ఉందని తాజా పరిశోధనలు బలంగా చెబుతున్నాయి. ఈ నీటిని ఉపయోగించుకుని అక్కడ వ్యోమగాముల కోసం స్థిరనివాసాలు ఏర్పాటుచేయాలని అమెరికా భావిస్తోంది. అక్కడి నుంచి అంతరిక్ష ప్రయోగాలు చేయాలని ఆశిస్తోంది. అరుణ గ్రహంపై యాత్రకు జాబిలిని మజిలీగా మార్చుకోవాలని భావిస్తున్నారు. హీలియం--3 అనే అరుదైన ఐసోటోప్ చందమామపై సమృద్ధిగా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వ్యోమగాములు అక్కడ స్థిరపడ్డాక ఈ ఐసోటోప్‌తో కేంద్రక సంలీన చర్య ద్వారా నిరంతరాయంగా కరెంట్‌ను ఉత్పత్తిచేసి విద్యుత్ అవసరాలను తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# పశ్చిమాసియా మంటలు!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూల బాధ్యతారహిత చర్యతో ఒక్కసారిగా పశ్చిమాసియా నిప్పులకొలిమైంది. శనివారం ఉదయం ఒక పథకం ప్రకారం ఇజ్రాయెల్, అమెరికా సైనిక బలగాలు ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక నగరాలు, పట్టణాలపై బాంబులతో, క్షిపణులతో విరుచుకుపడి ఆరంభంలోనే ఇరాన్ మత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీతోపాటు ఆయనతో చర్చిస్తున్న కీలకమంత్రులు, రక్షణరంగ బాధ్యులతో సహా దాదాపు 30 మందిని హత మార్చాయి. పర్యవసానంగా యుద్ధం ఆరంభమైన మూడో రోజుకే ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా దేశాలన్నీ భగ్గున మండుతున్నాయి. అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా సాగుతున్న ఈ దాడులతో కోట్లాదిమంది ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టు కుని ఉన్నారు. మంగళవారం విమాన రాకపోకలు మొదలెడతామని దుబాయ్ అంటు న్నది. సాధ్యాసాధ్యాలపై సంశయాలున్నాయి. సాధారణంగా యుద్ధం తొలి దశలో దేశాధినేతలు, ఇతర కీలక బాధ్యుల జోలికి పోరు. చర్చలకు రప్పించటం, రాజీ తప్ప మరే మార్గమూ లేదన్న అభిప్రాయం కలిగించడం దీని వెనకుండే వ్యూహం. కానీ ట్రంప్, నెతన్యాహూల దుందుడుకుతనం ఆ అవ కాశానికి శాశ్వతంగా తలుపులు మూసింది. అందుకే యుద్ధం ఎడతెగకుండా సాగుతుందన్న అభిప్రాయం బలపడుతోంది. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడ్డ ఎప్‌స్టీన్‌తో ఉన్న నీతిబాహ్య సంబంధాలు బట్టబయలు కావటం, స్వీయ తప్పిదాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ దివాలా స్థితికి చేరుకుని సాధారణ ప్రజానీకం దుర్భరమైన స్థితిలో బతుకీడ్వటంవంటి పరిణామాల నేపథ్యంలో వచ్చే నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి ట్రంప్ ఈ దుస్సాహసానికి తెగించారు. అటు పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయి పదవీభ్రష్టత్వం, జైలు తప్పవని బెంగటిల్లుతున్న నెతన్యాహూ సరిజోడీ అయ్యారు. ఇద్దరికిద్దరూ ప్రపంచాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెట్టారు. అంతక్రితం మాటెలా ఉన్నా పశ్చిమాసియాకు సంబంధించి అమెరికా మూడున్నర దశాబ్దాలుగా కట్టుకథలతో కాలక్షేపం చేస్తోంది. అకారణంగా దాడులకు దిగుతూ, జనహననానికి పాల్పడుతూ తప్పుడు సాకులు వెదుకుతోంది. మొదట ఇరాక్--కువైట్‌ల మధ్య చిచ్చురగిల్చి, ఆ తర్వాత ఇరాక్‌ను అదుపు చేయడానికంటూ 1990--91లో 'ఆపరేషన్ డిజర్ట్ స్టార్మ్' పేరిట అమెరికా విరుచుకుపడింది. కనీసం అప్పుడు భద్రతా మండలి అనుమతి తీసుకుంది. 35 దేశాలను తోడుతెచ్చుకుంది. అసత్యాలే చెప్పినా దేశ ప్రజలనుద్దేశించి సీనియర్ బుష్ నాలుగు దఫాలు ప్రసంగించారు. కానీ చివరకు అదంతా అమెరికా మాయోపాయం వల్లే జరిగిందని ఆలస్యంగా గ్రహించిన చాలా దేశాలు సీనియర్ బుష్ కుమారుడు జార్జి డబ్ల్యూ బుష్ ఆధ్వర్యంలో సాగిన 2003 నాటి 'ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్' యుద్ధానికి మొహం చాటేశాయి. 'జీవ రసాయన ఆయుధాల' సాకుతో జరిపిన ఆ యుద్ధానికి బ్రిటన్, పోలెండ్, ఆస్ట్రేలియాలు మాత్రమే సహకరించాయి. భద్రతామండలి ఆమోదం దక్కలేదు. 2015 నాటికి 'జీవ రసాయన ఆయుధాలు' కూడా బూటకమని తేలింది. అందుకే కావొచ్చు... ట్రంప్ భద్రతామండలి సంగతలా ఉంచి, కనీసం చట్ట ప్రకారం అమెరికా ప్రతినిధుల సభ అనుమతి సైతం తీసుకోకుండా ఇప్పుడు చిచ్చు రగిల్చారు. ప్రపంచంలో జరిగే ఏ యుద్ధంలోనూ తలదూర్చబోనని హామీ ఇచ్చి ట్రంప్ గద్దెనెక్కారు. తీరా అందుకు విరుద్ధమైన పోకడలుపోతున్నారు. వాస్తవానికి అమెరికా--ఇరాన్‌లు ఒప్పందానికి చేరువలోవున్నాయని మధ్యవర్తి ఒమన్ ప్రకటించింది. కానీ 24 గంటలు గడవకుండానే ఏకపక్షంగా ట్రంప్ ఈ దుస్సాహసానికి తెగబడ్డారు. ఇరాన్‌తో స్నేహం నటిస్తూనే సౌదీ ద్రోహం చేసిందనీ, ఖమేనీపై దాడి వెనక దాని పాత్ర ఉన్నదనీ మీడియా కథనం. తమ సైనిక స్థావరాలుంటే ఇరుగుపొరుగు కన్నెత్తి చూడరని చెబుతూ 80వ దశకం నుంచి గల్ఫ్ దేశాలన్నిటా అమెరికా వాటిని నెలకొల్పింది. ఇరాన్ ప్రతీకార దాడులు అదంతా భ్రమగా తేల్చాయి. ఇప్పుడు హోర్మూజ్ జలసంధి మూతబడింది. ట్రంప్-- నెతన్యాహూ ద్వయం కదిలించిన ఈ తేనెతుట్టె ఇంకెన్ని పరిణామాలకు దారి తీస్తుందో,ఎంత జన నష్టానికీ, విధ్వంసానికీ కారణమవుతుందో చూడాల్సి ఉంది.

# 30 ఏళ్ల వయస్సులో స్లిమ్‌గా మారాలంటే ఈ 6అలవాట్లను అలవర్చుకోండి.. ఇక మీకు తిరుగుండదంతే..

ప్రస్తుత కాలంలో అధిక బరువు సమస్య చాలామందిని వెంటాడుతోంది. అయితే, బరువు తగ్గించే ప్రయాణాన్ని ఏ వయసులోనైనా ప్రారంభించవచ్చనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, బరువు తగ్గే ప్రయాణంలో శరీర సామర్థ్యం కూడా మారుతుందని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అందువల్ల, వయస్సు ప్రకారం బరువు తగ్గించే ప్రణాళికను రూపొందించడం చాలా ముఖ్యమంటున్నారు ఆరోగ్య నిపుణులు.. 30 సంవత్సరాల వయస్సులో చాలా మంది ప్రజలు ఊబకాయాన్ని కలిగి ఉంటారు. మీరు కూడా ఇందులో ఒకరిగా ఉన్నట్లయితే, జిమ్‌లో చేరే ముందు, ఖచ్చితంగా ఇక్కడ పేర్కొన్న చిట్కాలను అనుసరించండి. ఎందుకంటే ఇది శరీరాన్ని కొవ్వు రహితంగా మార్చడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సాధారణంగా చాలా మంది దీనిని విస్మరిస్తారు.. జిమ్‌కి వెళ్లిన తర్వాత కూడా అలాంటి వారు చాలా కాలం పాటు కొవ్వుతో ఇబ్బంది పడుతున్నారు. ఒత్తిడి లేకుండా ఉండటం: 30 ఏళ్ల వయసులో టెన్షన్‌కు లోటు ఉండదు.. కానీ ఒత్తిడి మీ బరువు తగ్గించే ప్రయాణాన్ని నెమ్మదిస్తుందని అర్థం చేసుకోవడం ముఖ్యం.. తక్కువ కేలరీలు తీసుకోవడం, తీవ్రంగా వ్యాయామం చేయడం ద్వారా మీరు ఎంత ప్రయత్నించినా బరువు



తగ్గరు.. ఈ క్రమంలో తరచూ ఒత్తిడికి గురైతే, బరువు తగ్గడం కూడా కష్టమవుతుంది.. నిద్రకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి: చాలా మంది నిద్రకు ప్రాధాన్యత ఇవ్వరు. అలాంటి వారిలో నిద్రించడానికి లేదా లేవడానికి ఎటువంటి నిర్ణీత సమయం ఉండదు. అంతేకాకుండా 6-7 గంటలు తగినంత నిద్రపోతున్నారా లేదా అనే దానిపై శ్రద్ధ చూపరు. నిద్రలేమి ఊబకాయంతో సహా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అటువంటి పరిస్థితిలో మీరు తగినంత సేపు నిద్రపోవడం చాలా ముఖ్యం.. చక్కెర, డైట్ సోడా, ఆల్కహాల్‌కు దూరంగా ఉండండి: 30 సంవత్సరాల వయస్సులో చాలా మంది ప్రజలు చక్కెర, డైట్ సోడా, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ప్రారంభిస్తారు. అటువంటి పరిస్థితిలో, బరువు తగ్గడం చాలా కష్టం అవుతుంది. ఎందుకంటే ఇవన్నీ శరీరంలో కొవ్వును పెంచడానికి పని చేస్తాయి. డైట్ సోడాను క్యాలరీ ఫ్రీ డ్రింక్ అని పిలిచినప్పటికీ, దానికి జోడించిన కృత్రిమ స్వీటెనర్ ఆరోగ్యానికి హానికరం.. జంక్ ఫుడ్స్ కాకుండా ఇంటి ఆహారాన్ని తినండి: జంక్ ఫుడ్స్ తినే వారికి ఊబకాయం అనేది అతిపెద్ద సమస్యగా మారుతుంది. అటువంటి పరిస్థితిలో, మీరు స్థూలకాయాన్ని వదిలించుకోవాలనుకుంటే ముందుగా మీ ఆహారం నుండి జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ పూర్తిగా తొలగించండి. బదులుగా ఇంటి ఆహారాన్ని తినండి. మీకు మీరే వంట చేసుకుంటే ఈ ప్రక్రియ మీకు చికిత్స లాగా కూడా ఉంటుంది. వేగంగా తినడం, ఆకలితో ఉండటం లాంటివి చేయకండి: బరువు తగ్గడంలో ఉపవాస ప్రణాళిక ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ ఇది ఆకలికి పూర్తిగా భిన్నమైనది. ఎందుకంటే ఇందులో మీరు ఆహారాన్ని పూర్తిగా వదులుకోవాల్సిన అవసరం లేదు. బదులుగా, ఇందులో మీరు ఆహారం, నాణ్యత, పరిమాణంపై శ్రద్ధ వహించాలి. మీకు ఆకలిగా అనిపించినప్పుడు మాత్రమే మీరు ఆహారం తినేలా చూసుకోవాలి.. మీ కడుపుని ఎప్పుడూ ఖాళీగా ఉంచకండి.. వేగంగా కూడా తినకండి.. ప్రొటీన్: బరువు తగ్గడానికి ప్రతి భోజనంలో ప్రోటీన్‌ను చేర్చుకోండి.. ఇది జీవక్రియను పెంచుతుంది. ఇంకా కేలరీలను బర్న్ చేయడానికి అవసరం. కండరాలు, ఎముకలను నిర్మించడంలో ప్రోటీన్ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# ఆంధ్రప్రదేశ్‌లో జాయ్‌ఆలుక్కాస్ విస్తరణ

## ● శ్రీకాకుళం మరియు విజయనగరంలో నూతన షోరూమ్‌ల ఘన ప్రారంభం







**శ్రీకాకుళం, మార్చ్13, (నినాదం):** ప్రపంచ ప్రఖ్యాత ఆభరణాల సంస్థ జాయ్ ఆలుక్కాస్, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం మరియు విజయనగరం నగరాల్లో తన సరికొత్త షోరూమ్‌లను అత్యంత వైభవంగా ప్రారంభించి తన ఉనికిని మరింత విస్తరించింది. శ్రీకాకుళంలో జరిగిన వేడుకలో అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే గొందు శంకర్ ఈ నూతన షోరూమ్‌ను ప్రారంభించగా ,విజయనగరంలో జరిగిన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కత్తిరించారు. ఈ కార్యక్రమాల్లో విజయనగరం మేయర్ వెంపాడ విజయలక్ష్మి మరియు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రత్యేక అతిథులుగా పాల్గొని వేడుకకు మరింత శోభను చేకూర్చారు. జాయ్‌ఆలుక్కాస్ యాజమాన్యం తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యూ, సీఓఓ హెన్రీ జార్జ్, మార్కెటింగ్ హెడ్ అనీష్ వర్గీస్, రీటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్ మరియు రీజినల్ మేనేజర్ రెజిష్ ఓఎస్ సమక్షంలో ఈ ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానాన్ని పొందిన "వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్"గా, అత్యుత్తమ నాణ్యత మరియు వినూత్న డిజైన్లతో ఉత్తరాంధ్ర ప్రజలకు అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత మళ్లీ మళ్లీ ఎందుకు తిరగబెడుతోంది..? దీనిని అడ్డుకోలేమా..

క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. ఈ వ్యాధి శరీరాన్ని గుల్ల చేస్తుంది. చికిత్స కూడా అదే స్థాయిలో తీవ్ర వేధనకు గురి చేస్తుంది. అయితే రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్.. వంటి సందర్భాల్లో చికిత్స విజయవంతంగా పూర్తైన తర్వాత.. పూర్తిగా కోలుకుంటారు. కానీ 25 ఏళ్లు, 30 ఏళ్ల తర్వాత మళ్లీ క్యాన్సర్ బయటపడుతుంది. ఇలాంటి వారి జీవితాల్లో క్యాన్సర్ మరోసారి విధ్వంసం సృష్టించింది. దీంతో క్యాన్సర్ చికిత్స తర్వాత, ఈ వ్యాధి మళ్లీ మళ్లీ ఎందుకు పునరావృతమవుతుంది? అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా, గత కొన్ని దశాబ్దాలుగా క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గతంతో పోల్చితే ఈ వ్యాధి గురించి ప్రజలు ప్రస్తుతం మరింత అవగాహనతో ఉన్నారు. అందువల్ల సకాలంలో రెగ్యులర్ చెకప్‌ల కారణంగా ఎక్కువ కేసులు గుర్తించి చికిత్స తీసుకుంటున్నారు. చాలా మంది క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించ గలుగుతున్నారు. చికిత్స చేయించుకున్న తర్వాత ప్రజలు క్యాన్సర్ నుంచి విముక్తి పొందుతున్నారు. అయితే ఒకసారి క్యాన్సర్ నయమైన తర్వాత, అది ఇతర అవయవాలలో అభివృద్ధి చెందడం లేదంటే అదే భాగంలో తిరిగి విజృంభించడం వంటివి ఎందుకు జరుగుతాయో.. అందుకు కారణం ఏమోటో ఇక్కడ తెలుసుకుందాం.. నిపుణులు ఏమంటారు? క్యాన్సర్ వెనుక కారణం కణాల అనియంత్రిత పెరుగుదల. దీని వెనుక మన అనారోగ్య జీవనశైలి, అధిక ధూమపానం, ఇతర కారణాలు ఉన్నాయి. కానీ చాలా సందర్భాలలో క్యాన్సర్ నయమైతే, అది శరీరంలోని ఇతర భాగాలలో మళ్లీ సంభవిస్తుందని డాక్టర్ అజయ్ కుమార్ చెబుతున్నారు. క్యాన్సర్ మళ్లీ ఎందుకు వస్తుంది? క్యాన్సర్ అనేది ఒక ప్రమాదకరమైన వ్యాధి. ఇది చాలా సందర్భాలలో నయమైన తర్వాత మళ్లీ వస్తుంది. నేడు, క్యాన్సర్ చికిత్సకు అనేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇవి క్యాన్సర్‌ను నయం చేస్తాయి. అయితే క్యాన్సర్ పునరావృతానికి మాత్రం అనేక కారణాలు కారణమవుతాయి. పునరావృతమయ్యే క్యాన్సర్ వెనుక ఉన్న అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం. ఒకసారి నయమైన తర్వాత రోగి మళ్లీ తన పాత అనారోగ్య అలవాట్లను అనుసరించడం ప్రారంభిస్తే క్యాన్సర్ పునరావృతమయ్యే ప్రమాదం పెరుగుతుంది. అధిక ధూమపానం, పొగాకు వినియోగం కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. క్యాన్సర్ నయమైన తర్వాత, మళ్లీ వీటిని తీసుకునే వారికి మళ్లీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అనేక సందర్భాల్లో, కుటుంబ చరిత్ర కూడా క్యాన్సర్ పునరావృతానికి కారణం అవుతుంది. శరీరంలో క్యాన్సర్ కణాలు మిగిలి ఉండటం వల్ల మళ్లీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు చికిత్స చేసినప్పటికీ కొన్ని క్యాన్సర్ కణాలు శరీరంలో చురుకుగా ఉండి మళ్లీ క్యాన్సర్‌గా మారుతాయి. ఈ కణాలు శరీరంలోని ఇతర భాగాలలో కూడా అభివృద్ధి చెంది క్యాన్సర్‌కు కారణం అవుతాయి. మహిళల్లో చిన్న వయసులోనే గర్భనిరోధక మాత్రలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నేటి కల్తీ యుగంలో, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అనేక అంశాలు ఉన్నాయి. క్యాన్సర్‌ను గుర్తించడానికి స్కాన్ చేసుకోవాలి. క్యాన్సర్ నయమైన తర్వాత, వైద్యులు మొత్తం శరీరాన్ని స్కాన్ చేయకపోతే మళ్లీ క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉండే ప్రమాదం ఉంది.



# ఈ గింజలను ఇలా తింటే పొట్ట తగ్గడం ఖాయం..! బరువు తగ్గి, ఎముకలు బలంగా ఉంటాయ్..!



బరువు తగ్గడానికి చియా గింజల నీరు: బరువు తగ్గడానికి చియా గింజల నీటిని తీసుకోవచ్చు. దీని కోసం ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే పరగడుపున దీన్ని సేవించండి. ఈ నీటిని రోజూ తీసుకోవడం వల్ల చాలా వరకు బరువు తగ్గవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ స్మూతీ: బరువు తగ్గడానికి చియా విత్తనాలను స్మూతీస్‌లో ఉపయోగించవచ్చు. దీని కోసం మీకు ఇష్టమైన పండ్లు, పెరుగును వేసి కలపాలి. తర్వాత ఒక చెంచా నానబెట్టిన చియా గింజలను వేసి అన్ని మిక్స్ చేయండి. దీన్ని అల్పాహారంగా తీసుకోవచ్చు. సలాడ్‌లో చియా విత్తనాలను ఉపయోగించండి : బరువు తగ్గడానికి, చియా గింజలను సలాడ్‌లో కలిపి తినవచ్చు. ఇది మీ కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని కోసం, మీరు సలాడ్లో 1-2 స్పూన్ల చియా విత్తనాలను తినవచ్చు. కావాలనుకుంటే నిమ్మరసం, నల్ల మిరియాలు కూడా చల్లుకోవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్: బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్ ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. దీన్ని సిద్ధం చేయడానికి, ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను రాత్రంతా పాలలో నానబెట్టండి. ఇందులో పండ్లు, డ్రై ఫ్రూట్స్, నట్స్ వేసి ఉదయాన్నే తీసుకుంటే తినడానికి రుచికరంగా ఉంటుంది మరియు బరువు కూడా తగ్గుతుంది. ఓట్స్, చియా విత్తనాలు: మీరు అల్పాహారంగా ఓట్స్ తింటే, మీరు చియా విత్తనాలను కూడా అందులో కలుపుకోవచ్చు. ఓట్స్‌లో చియా గింజలను వేసుకోవటం వల్ల మీ అల్పాహారం మరింత పోషకమైనదిగా మారుతుంది.ఇదిశరీరంలోని అదనపు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది.

## అధిక రక్తపోటును ఇలా కూడా గుర్తించవచ్చు..

కానీ పరీక్షల చేయించుకున్న తర్వాత గానీ చాలా మందికి శరీరంలో అధిక రక్తపోటు ఉన్నట్లు అర్థమవుతుంది. నిజానికి మైకము, భయము, చెమట, నిద్రలేమి అధిక రక్తపోటు వంటి ప్రారంభ లక్షణాలు ద్వారా అధిక రక్తపోటును గుర్తించవచ్చంటున్నారు నిపుణులు. కానీ ఈ లక్షణాలు చాలా సాధారణం. వీటి ద్వారా మాత్రమే అధిక రక్తపోటుతో బాధపడుతున్నారా లేదా అని నిర్ధారించడం సాధ్యం కాదు. 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' ప్రకారం.. కళ్లు ఎరుపు రంగులోకి మారడం, కనుగుడ్డుపై ఎర్రటి రక్తపు ఛాయలు కనిపించడాన్ని సబ్‌కంజంక్టివల్ హెమరేజ్ అని పిలుస్తారు. ఇది అధిక రక్తపోటు హెచ్చరిక సంకేతంగా పరిగణిస్తారు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. డయాబెటిక్ రోగుల కంటి రంగు కూడా కొన్నిసార్లు ఎరుపు రంగులో ఉంటుంది. ఇవే లక్షణాలు అధిక రక్తపోటు ఉన్న రోగులలో కూడా కనిపిస్తాయి. ఫలితంగా, ఇది రెండు వ్యాధుల సాధారణ లక్షణంగా పరిగణిస్తుంటారు. ముఖం ఎర్రబడటం, ఎరుపు కళ్ళు అధిక రక్తపోటు ప్రారంభ సంకేతాలు. ముఖంలోని రక్తనాళాలు పల్చగా మారినప్పుడు ముఖం ఎర్రబారడం జరుగుతుంది. కాబట్టి మీరు ఈ విషయాలన్నీ గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# ఈ రెండు విటమిన్లు లోపిస్తే క్యాన్సర్ ముప్పు తప్పదు.. ఆ మార్పులను తేలికగా తీసుకోవద్దు!



క్యాన్సర్ అత్యంత ప్రాణాంతక వ్యాధి. అయితే, చికిత్సలు, మందులతో క్యాన్సర్ ఆటకట్టించొచ్చు. కానీ చికిత్స ఆలస్యమైతే రోగిని రక్షించడం కష్టం. అంతేకాకుండా క్యాన్సర్ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది అందువల్లనే క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా నేటికీ పరిగణిస్తుంటారు. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలు, మందులు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ చికిత్స ఆలస్యమైతే, రోగిని రక్షించడం కష్టం. ముఖ్యంగా శరీరంలో మూడు విటమిన్లు లోపిస్తే క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలోని ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చు. జన్యుపరమైన కారకాలు, విటమిన్లు, ఖనిజాల లోపం వల్ల కూడా క్యాన్సర్ వస్తుంది. శరీరంలో విటమిన్ సి లోపం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ సిని ఆస్కార్బిక్ ఆమ్లం అని కూడా పిలుస్తారు. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో పాటు విటమిన్ 'సి' కొల్లాజెన్ సంశ్లేషణ, గాయాల నయం, వ్యాధుల నివారణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపం వల్ల అన్నవాహిక, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచుతుంది.రోగనిరోధక శక్తిని పెంచడానికి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి విటమిన్-సి అధికంగా ఉండే ఆహారాలు (పాలు, పాల ఉత్పత్తులు, నిమ్మకాయలు, టమోటాలు, క్యారెట్లు, చింతపండు మొదలైన సిట్రస్ పండ్లు) తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. విటమిన్ సితోపాటు విటమిన్ ఎ కూడా క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉంటుంది. ఇది కంటి చూపుతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, జన్యు నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. విటమిన్ ఎ లోపం ఊపిరితిత్తులు, అన్నవాహిక, కడుపు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. క్యారెట్, గుమ్మడికాయ, పండిన బొప్పాయి, పాలకూర, నెయ్యి, వెన్న, కొవ్వు చేపలు, మాంసం, గుడ్లు వంటి వివిధ కూరగాయలలో విటమిన్ ఎ అధిక స్థాయిలో ఉంటుంది. కాబట్టి ఈ ఆహారాలను డైట్‌లో ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు విటమిన్ డి ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. సాధారణంగా విటమిన్ ఎ సూర్యకాంతి నుండి లభిస్తుంది. విటమిన్ డి లోపం వల్ల రొమ్ము, ప్రోస్టేట్, కొలొరెక్టల్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ విటమిన్ లోపాన్ని భర్తీ చేయడానికి సూర్యరశ్మి తగిలేలా ఉండాలి. గుడ్డు సొనలు, సముద్రపు చేపలు, పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవాలి.

# ఇప్పటి మీరు ప్లాస్టిక్ బాటిళ్లలోనే నీళ్లు తాగుతున్నారా..? మీ ఆరోగ్యం అంతే సంగతి.. తస్మాత్ జాగ్రత్త..



క్యాన్సర్ వచ్చే ప్రమాదం: ప్లాస్టిక్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల శరీరం దానిలోని రసాయనాలతో ప్రత్యక్ష సంబంధంలోకి వస్తుంది. దీని కారణంగా మన శరీరం అనేక వ్యాధులకు రిజర్వాయర్‌గా మారుతుంది. ప్లాస్టిక్‌లోని సీసం, కాడ్మియం, మెర్క్యురీ వంటి రసాయనాలు శరీరంలో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి విడుదలయ్యే రసాయనాలు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇది మన రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రోజుల తరబడి ప్లాస్టిక్ బాటిల్స్ లో నీరు తాగుతూ ఉంటే మనిషిలోని రోగనిరోధక శక్తి సన్నగిల్లే ప్రమాదం ఉంది. కాలేయ క్యాన్సర్: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల థాలేట్స్ అనే రసాయనాలు మన శరీరంలోకి చేరి కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. అసలే ఇది వేసవి కాలం.. ప్లాస్టిక్ బాటిల్స్ పై ఎండ పడితే అవి మైక్రోప్లాస్టిక్ ను విడుదల చేస్తాయి. ఆ నీరు తాగితే హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. అండాశయ క్యాన్సర్: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ప్లాస్టిక్‌లోని రసాయనాల వల్ల మహిళల్లో అండాశయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ బాటిల్‌కు ఎండ తగిలితే..డయాక్సిన్ లాంటి విషపదార్థాలు నీటిలో కలుస్తాయి. ఆ నీరు తాగడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పొంచివుంది. ప్లాస్టిక్ బాటిల్‌తో ఇన్ని అనార్థలను ఎదుర్కొకక తప్పదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా రాగి బాటిల్స్,ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న స్టీల్, మట్టి, వెదురు బాటిల్స్ వంటివి వాడితే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. తప్పనిసరిగా ప్లాస్టిక్ బాటిళ్లు ఉపయోగించుకోవాల్సి వస్తే ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్?ను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# చెవి నొప్పిని లైట్ తీసుకోకండి.. అది తీవ్రమైన వ్యాధి లక్షణం కావచ్చు



చెవి నొప్పి.. కంటికి కనిపించకుండా మనిషిని ముప్పుతిప్పలు పెట్టే అనారోగ్య సమస్య.. మీరు తరచుగా చెవి నొప్పి సమస్యతో ఇబ్బంది పడుతున్నారా..? మెడికల్ షాపులో లభించే ఏదో ఒక డ్రాప్స్ వేసి ఉపశమనం పొందుతున్నారా..? ఇలా చేయటం ప్రమాదం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. తరచూగా వచ్చే చెవి నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే ఇది చాలా తీవ్రమైన వ్యాధులకు కారణం కావచ్చునని చెబుతున్నారు. చెవి నొప్పిని తేలికగా తీసుకుంటే, అది భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారుతుందని చెబుతున్నారు. చెవి నొప్పిని వదిలించుకోవడానికి ప్రజలు తరచుగా ఆయుర్వేదం లేదా, ఏదొక నొప్పి నివారణ మందులు తీసుకుంటారు. వాటివల్ల ఈ నొప్పి నయమవ్వచ్చు.. కాకపోవచ్చు. చెవి నొప్పి ఒకటి రెండు రోజులకంటే ఎక్కువ ఉంటే, దానిని నిర్లక్ష్యం చేయడం సరికాదంటున్నారు. అలాంటప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు. చెవి నొప్పి సమస్య ఉన్నప్పుడు నీరు, షాంపూ చెవుల్లోకి వెళ్లకుండా చూసుకోవాలి. దీని వల్ల కూడా చెవి నొప్పి మరింత తీవ్రమవుతుంది. కాబట్టి స్నానం చేసేటప్పుడు చెవ్వుల్లో కాటన్ పెట్టుకోవడం మంచిది.

# విశ్వేజ

# పొద్దునే ప్రొటీన్ ఫుడ్



పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా
ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి.. రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రాజ్మా పరాఠా, కప్పు పెరుగు.. మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి. సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్.. సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్
ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. మొలక పెసర్లు ఓట్స్ చీలా ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# ఇవి తిందాం.. అవి మానేద్దాం!

వర్షాకాలంలో ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. అందుకే, ఈ సమయంలో ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే.. అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఉంటుంది. అందుకే, ఈ వానల సీజన్‌లో ఏయే పదార్థాలు తినాలో.. వేటిని పక్కన పెట్టాలో నిపుణులు చెబుతున్న సూచనలు.. వర్షాకాలం.. వివిధ అనారోగ్యాల ప్రమాదాన్ని పెంచుతుంది. ఈ సమయంలో జీర్ణవ్యవస్థ బలహీనపడుతుంది. ముఖ్యంగా, కడుపు సమస్యలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఫుడ్ పాయిజనింగ్ వంటి సాధారణ సమస్యలు కనిపిస్తాయి. కాబట్టి, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం.

ఏమేమి తినొచ్చు.. వర్షాకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది. కాబట్టి, తేలికైన, సులభంగా జీర్ణమయ్యే తక్కువ వేయించిన ఆహారాన్ని తీసుకోవాలి. ఇక గోరువెచ్చని నీరు, అల్లం టీ, తులసి (పవిత్ర తులసి) కషాయం లాంటివి జీర్ణవ్యవస్థకు ఉపశమనం కలిగించడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. కాలానుగుణంగా దొరికే పండ్లు కూడా శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. పెరుగు, మజ్జిగ వంటి ప్రోబయోటిక్ ఆహారాలు.. పేగు ఆరోగ్యానికి మేలుచేసే బ్యాక్టీరియాను పెంచుతాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి. రోగ నిరోధక శక్తిని పెంచే పసుపు కలిపిన పాలు, తులసి, అల్లం, వెల్లుల్లి, ఉసిరి లాంటివాటిని విరివిగా తీసుకోవాలి.

వీటికి దూరం.. చాట్, పకోడా, పానీపూరి లాంటి స్ట్రీట్ ఫుడ్స్.. వర్షాకాలంలో బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్లు పెంచే ప్రదేశాలుగా మారతాయి. కాబట్టి, వీటికి దూరం ఉంటేనే మంచిది. ఇక పకోడీలు, సమోసాలు, చిప్స్ వంటి వేయించిన ఆహారాలు.. ఎక్కువ కారంగా ఉండే పదార్థాలు జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇతర కాలాల్లో ఆరోగ్యానికి మేలుచేసే ఆకుకూరలు.. వర్షాకాలంలో అనారోగ్యానికి కారణం కావొచ్చు. పాలకూర, మెంతికూర వంటి ఆకుకూరల్లో సూక్ష్మక్రిములు, మట్టి కణాలు చేరే అవకాశం ఉంటుంది. వీటిని శుభ్రంగా కడిగి.. బాగా ఉడికించిన తర్వాతే తినాలి. పచ్చి కూరగాయలు, సలాడ్లను తగ్గించాలి. వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల చేపలు, రొయ్యలు లాంటివి త్వరగా పాడవుతాయి. వీటిని తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి, వర్షాకాలంలో వీటిని దూరం పెట్టాలి.

# చియా సీడ్స్ తీసుకున్న ఆ తరువాత ఆ పని చేయకపోతే కష్టం



ప్రస్తుతం చియా సీడ్స్ చాలామంది ఆహారంలో ఒక భాగంగా మారాయి. పోషకాల విషయంలో వీటిని సూపర్ ఫుడ్ గా చెప్పుకోవచ్చు. చాలా సులభంగా ఎలాంటి ఆహారంలోనైనా కలుపుకోవచ్చు. గ్రానోలా, స్మూతీస్, పుడ్డింగ్, సలాడ్ డ్రెస్సింగ్, మఫిన్స్, చియా వాటర్ వంటి వాటిలో కూడా వీటిని ఉపయోగించవచ్చు. చియా గింజలను ప్రతిరోజూ తినడం మంచిదేనా? అనే విషయంపై డైటీషియన్లు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. చియా గింజలు అంటే ఏమిటి? చియా సీడ్స్.. ఆస్ట్రేలియా, లాటిన్ అమెరికా, దక్షిణ అమెరికా ప్రాంతాలలో పెరిగే చియా మొక్క నుండి వస్తాయి. చియా సీడ్స్ నీటిని పీల్చుకుని వాటి పరిమాణం కంటే 10 నుండి 12 రెట్లు ఎక్కువగా వ్యాకోచిస్తాయి. వీటి ప్రత్యేకత ఇదే. నీటిలో కరిగే ఫైబర్ అధికంగా ఉండటం వల్లే ఈ సీడ్స్ ఇలా వ్యాకోచిస్తాయి. "వాడిన నూనెను మళ్ళీ వాడుతున్నారా? అయితే హాస్పిటల్ లో బెడ్ కన్ఫర్మ్!" అందుకే చియా సీడ్స్ మొక్కల ఆధారిత లేదా పాల పదార్థాలను చిక్కగా చేసి క్రీమీ పుడ్డింగ్‌గా మారుస్తాయి. చియా సీడ్స్ లలోని ఫైబర్ కారణంగానే ఇవి బరువు తగ్గడానికి, మలబద్ధకం నివారణకు సహాయపడతాయి. చియా గింజల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి? చియా గింజల్లో అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ప్రతి పోషకం దాని స్వంత ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. చియా గింజలను ప్రతిరోజూ తినడం సురక్షితమేనా? చియా గింజలను ప్రతిరోజు తినడం సురక్షితమే అయినప్పటికీ, వాటిని తిన్నప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. "ఫైబర్ సాధారణంగా ఆరోగ్యానికి మంచిదే, కానీ ఎక్కువ ఫైబర్ తింటే కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి" అని డాక్టర్ బియాస్ హెచ్చరించారు.

# వెనిగర్‌ని వాడేద్దాం

మార్కెట్‌లో దొరికే కూరగాయలు, ఆకుకూరలపై క్రిమిసంహారక మందుల అవశేషాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఎంత శుభ్రం చేసినా.. కొన్నిసార్లు అలాగే ఉండిపోతుంటాయి. అలాంటప్పుడు.. వెనిగర్ కలిపిన నీటితో కూరగాయలు, ఆకుకూరలను శుభ్రం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. కొత్తిమీర, పుదీనాను వెనిగర్ కలిపిన నీటిలో నానబెడితే.. ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. వంటలకు పులుపు కావాలంటే.. కొద్దిగా వెనిగర్‌ను వాడుకోవచ్చు. దీనివల్ల వంట రుచి తగ్గకుండా ఉంటుంది. ముఖ్యంగా సలాడ్లు, గ్రేవీ వంటకాల్లో వెనిగర్ బాగా ఉపయోగపడుతుంది. మాంసం మెత్తగా ఉడకాలంటే.. వెనిగర్‌ను వాడాల్సిందే. మాంసానికి కొద్దిగా వెనిగర్ రాయడం వల్ల ముక్కలు మెత్తబడుతాయి. త్వరగా ఉడుకుతాయి. అంతేకాదు.. మాంసంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, కొవ్వును తొలగించడంలోనూ వెనిగర్ సాయపడుతుంది. వెనిగర్‌తో మాంసం రుచి కూడా పెరుగుతుంది. కేవలం వంటలకు మాత్రమే కాదు.. వంటింటిని శుభ్రం చేయడంలోనూ వెనిగర్ ముందుంటుంది. కూరగాయలు తరిగే బోర్డ్, స్టీల్ పాత్రలు, గాజు వస్తువుల మీది మరకలు, దుమ్ము, నూనె జిడ్డును తొలగించడంలో వెనిగర్ సమర్థంగా పనిచేస్తుంది. నీటిలో కొద్దిగా వెనిగర్ కలిపి.. ఆయా వస్తువులను తుడిస్తే తళతళా మెరిసిపోతాయి. వెనిగర్‌ను సరిగ్గా వాడితే.. వంట పనులు వేగంగా పూర్తవుతాయి.



# మార్కెట్

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 176 పాయింట్లు డౌన్..

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 25,500 పాయింట్ల దిగువకు చేరింది. గ్లోబల్ మార్కెట్‌లోని మిశ్రమ ఫలితాల నేపథ్యంలో మార్కెట్లు ఉదయం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. పొద్దంతా మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో అమ్మకాలతో మార్కెట్లు మరింత పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,625.89 పాయింట్ల నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,382.28 పాయింట్ల కనిష్టాన్ని చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,781.36 పాయింట్లకు చేరింది. చివరకు 176.43 పాయింట్లు తగ్గి 83,536.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.40 పాయింట్లు తగ్గి.. 25,476.10 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,973 షేర్లు లాభపడగా.. 1,888 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందాల్కో ఇండస్ట్రీస్, అపోలో హాస్పిటల్స్, టెక్ మహీంద్రా ఉన్నాయి. అయితే, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, కోల్ ఇండియా లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే మెటల్, రియాల్టీ, ఆయిల్, గ్యాస్ సూచీలు ఒక్కొక్కటి 1.4 శాతం.. మీడియా, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.5 శాతం, ఎఫ్ఎంసీజీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.3నుంచి 0.8 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది.



# 5 బ్యాంకులు ప్రైవేటీకరణ.. వాటాల విక్రయానికి రంగంలోకి కేంద్రం

బీవోఎం, ఐవోబీ, యూకో తదితర సంస్థలే గురి



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య క్రమేణా తగ్గిపోతున్నది. కుదిరితే వాటాల విక్రయాలు, కాకపోతే విలీనాలు. ఇదీ.. గత 11 ఏండ్లుగా సాగుతున్న తంతు. ఈ క్రమంలోనే ఇప్పుడు మరో 5 సర్కారీ బ్యాంకుల్లో వాటాల విక్రయానికి కేంద్రం సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే మంగళవారం ఈ లావాదేవీల కోసం సాంకేతిక, న్యాయపరమైన సలహాదారులను నియమించేందుకు అంతర్గత మంత్రుల బృందం కూడా సమావేశమైనట్టు సమాచారం. ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి, పెట్టుబడులు-ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తదితరులు ఇందులో పాల్గొన్నట్టు తెలుస్తున్నది. దీంతో ఇక క్షేత్రస్థాయిలో పని మొదలుకానుండగా.. వీలైనంత త్వరలోనే సదరు బ్యాంకుల్లో సర్కారీ వాటాలు తగ్గిపోనున్నాయి. అయితే ఆయా బ్యాంకుల్లో కేంద్రం 20 శాతం వరకు వాటాలను అమ్మకానికి పెట్టే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. ఈ బ్యాంకుల్లోనే.. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ), యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో వాటాల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతున్నది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ), ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతుల ద్వారా వాటాలను ప్రభుత్వం విక్రయానికి పెట్టబోతున్నదని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. లావాదేవీల నిర్వహణకు మర్చంట్ బ్యాంకర్ల నియామకం జరిగితే.. నిధుల సమీకరణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని పేర్కొంటున్నాయి. వాటాల విలువ, ఎంత వాటా అమ్మేయాలి? కావాల్సిన పత్రాలు, వాటి ద్వారా అనుమతులు తీసుకోవడం ఇవన్నీ చకచకా జరిగిపోనున్నాయి. అన్నీ కుదిరితే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26), లేకుంటే ఎలాగైనా వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) వాటాల అమ్మకాలు కచ్చితంగా ఉంటాయని ప్రభుత్వ ఉన్నత వర్గాల ద్వారా తెలియవస్తున్నది. కాగా, రూ.2,000 కోట్లకు దిగువన ఉండే లావాదేవీలకు కొందరు మర్చంట్ బ్యాంకర్లు, ఆపై విలువైన లావాదేవీలకు మరికొందరిని నియమించవచ్చని అంచనా. ఆ రెండే.. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను ప్రైవేటీకరించాలని మోదీ సర్కారు ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నది. 2021-22 కేంద్ర బడ్జెట్‌లోనే ఇందుకు ప్రణాళికల్ని కూడా పెట్టింది. కానీ ఇప్పటిదాకా అది కుదరలేదు. దీంతో త్వరలో రాబోయే వాటాల ఉపసంహరణలో ముందుగా ఈ రెండింటినే ప్రైవేటీకరణ దిశగా ముందుకు జరుపాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నట్టు చెప్తున్నారు. ఇప్పటికే ఐడీబీఐ బ్యాంక్‌ను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తుండగా, ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ ద్వారా కేంద్రం పావులు కదుపుతున్న సంగతి విదితమే. బ్యాంక్‌లో ఎల్ఐసీతో ప్రభుత్వ వాటాను కొనిపించినది తెలిసిందే. ఈ క్రమంలో ఆ వాటాలను అమ్మేందుకు తీవ్రంగా కసరత్తులు చేస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. ఇక అంతకు ముందు ఆయా ప్రభుత్వ బ్యాంకులను ఎస్బీఐ, మరికొన్నింటిలో విలీనం చేసినదీ విదితమే.

## టాప్‌గేర్‌లో ఈవీల విక్రయాలు.. జూన్‌లో 28 శాతం వృద్ధి : ఫాడా వెల్లడి

ముంబై : దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తున్నది. గత నెలలో దేశీయంగా 1.80 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే 28.60 శాతం అధికమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ (ఫాడా) తాజాగా వెల్లడించింది. ఈ-ప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు కారణమని తెలిపింది. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన అమ్మకాలు 7,323 యూనిట్ల నుంచి 13,178 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం వాహన విక్రయాల్లో ప్యాసింజర్ వాహనాల వాటా 4.4 శాతానికి ఎగబాకింది. అలాగే 60, 550 యూనిట్ల ఎలక్ట్రిక్ త్రి-చక్ర వాహనాలు కాగా, 1,05,355 యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. కమర్షియల్ వాహనాలు ఏడాది ప్రాతిపదికన రెండింతలు పెరిగి 1,146 యూనిట్లకు చేరుకున్నాయి. పెట్రోల్ ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో వాహన కొనుగోలుదారులు ఈవీలపై ఆసక్తి చూపుతున్నారని, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక స్కీంలు కూడా ఆకట్టుకుంటున్నాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. చార్జింగ్ స్టేషన్లు అత్యధికంగా ఏర్పాటుకావడంతో చార్జింగ్ ఇబ్బందులు కూడా లేకుండా పోయాయన్నారు.



# రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు

### పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు

### అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ

### సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సీఎం చంద్రబాబు



విజయవాడ,మార్చి13 : రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ.20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ.14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నారన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతోపాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ కార్యక్రమాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూడదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడామన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నానన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు. ÷-రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ.500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు. పక్కనే ఉన్న తమిళనాడు కానీ.. కర్ణాటక కానీ రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కానీ ఏపీలో రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చిన ఏకైక ప్రభుత్వం.. ఎన్డీఏ ప్రభుత్వమని స్పష్టం చేశారు. పొగాకు, ఉల్లి రైతులను ఆదుకునేలా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. మోటా, కోకో పంటలు దెబ్బ తింటే.. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. నష్టపోయిన రైతాంగానికి రూ.1,338 కోట్లు అందచేశామని గుర్తు చేశారు. మేము విజన్ 2047 తయారు చేశాం..ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కల సాకారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మనకు స్వాతంత్య్రం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుందన్నారు. ఆ సమయానికి మన దేశం, మన రాష్ట్రం అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి

### ప్రకటించిన ఇరాన్.. తిప్పి కొట్టిన అమెరికా

టెహ్రాన్,మార్చి13 : అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

## అమెరికా సుప్రీం లీడర్‌కు గాయాలు

### గుర్తు పట్టలేనంతగా గాయాలయ్యాయయన్న అమెరికా

వాషింగ్టన్,మార్చి13 : అమెరికా, ఇజ్రాయెల్‌లపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని, గుర్తుపట్టలేని విధంగా మారినట్లు భావిస్తున్నామన్నారు. అయితే, వీటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపించలేదు. పెంటగాన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని అంతం చేయడంపైనే అధ్యక్షుడు ట్రంప్ దృష్టి పెట్టారని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమం ముగింపే తమ ప్రధాన లక్ష్యమని అమెరికా రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇప్పటివరకు 15వేల లక్ష్యాలపై దాడులు చేశామన్నారు. మిగతా అన్ని స్థావరాలను ధ్వంసం చేయాలని యోచిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో దాడులు మరింత తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రాథమిక పాఠశాలపై ఎలా దాడి జరిగిందని అడిగిన ప్రశ్నకు సమాధానం దాటవేసిన పీట్ హెగ్సెత్.. అమెరికా ఎన్నడూ పౌరులను లక్ష్యంగా చేసుకోదన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు అమెరికా సెంట్రల్ కమాండ్‌తో సంబంధం లేని ఓ అధికారిని నియమించామన్నారు. వాస్తవాలను తెలుసుకున్న తర్వాత.. ఆ వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

## నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

### అల్లూరు జిల్లా గిరిజనలతో నేడు పవన్ భేటీ

అమరావతి,మార్చి13 : మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు వేడుకలకు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఏడాది పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని గిరిపుత్రుల మధ్య జరుపుకోవాలని పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని నందిగరువు గ్రామంలో పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొంటారు. గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకుంటూనే, వారి మధ్యే పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నారు. తొలుత ఓనూరు జంక్షన్ వద్ద జనసేన జెండాను పవన్ కళ్యాణ్ ఆవిష్కరిస్తారు. అనంతరం 'పీఎం జన్ మన్' (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద నిర్మించిన రోడ్లను ఆయన స్వయంగా పరిశీలిస్తారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు నిర్మించిన 2.4 కి.మీ రహదారిని కాలి నడకన ప్రయాణిస్తూ పనుల నాణ్యతను తనిఖీ చేస్తారు. తర్వాత నిర్మాణం పూర్తయిన రహదారులను గిరిజనుల సమక్షంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నందిగరువు గ్రామ ప్రజలతో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు 'మాటా-మంతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పర్యటన చివరలో గిరిజనులతో కలిసి పవన్ కళ్యాణ్ మధ్యాహ్న భోజనం చేస్తారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

### బళ్లారి ఘటనలో కర్నూలు దంపతుల దుర్మరణం

### అన్నమయ్య జిల్లాలో మరో ఇద్దరు మృత్యువాత

కర్నూలు,మార్చి13 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. కర్ణాటకలోని బళ్లారి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కర్నూలు జిల్లాకు చెందిన దంపతులు మృతిచెందారు. మరో ఘటనలో అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు హైవే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కర్ణాటకలోని బళ్లారి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కర్నూలు జిల్లాకు చెందిన దంపతులు మృతిచెందారు. బళ్లారి సమీపంలో మృతుల కారును కర్ణాటకకు చెందిన బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆదోనికి చెందిన అనురాగ్, ఐశ్వర్య దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా గుర్తించారు. అనురాగ్, ఐశ్వర్య దంపతులు కర్ణాటకలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొల్లూరు మూకాంబిక అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలియడంతో బళ్లారి పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు హైవే గొడ్డావుల కోట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారు. బొలెరో వాహనం కారును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందారు. అనంతపురం నుంచి మదనపల్లికి కారులో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## వంటగ్యాస్ కొరతపై హోటల్స్ యజమానుల ఆందోళన

### ఆర్థిక మంత్రి పయ్యావులతో కలసి చర్చలు

### ఆంక్షలతో హోటల్స్ నడిపేందుకు సిద్దమని వెల్లడి

### సోమవారం నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి

అమరావతి,మార్చి13 : రాష్ట్రంలో వంటగ్యాస్ కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమరావతిలోని సచివాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. గ్యాస్ కొరత కారణంగా హోటల్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై చర్చించారు. విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్యాస్ పొదుపు కోసం తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ పలు ప్రతిపాదనలు మంత్రి ముందు ఉంచారు. గ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు హోటళ్ల పనివేళలను కుదించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సోమవారం హోటళ్లకు సెలవు దినంగా ప్రకటిస్తే గ్యాస్ పొదుపునకు అవకాశం ఉంటుందని సూచించారు. రెస్టారెంట్లలో లభించే మెనూను కుదించాలని, అలాగే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వ్యాపారాన్ని నియంత్రించడం ద్వారా గ్యాస్ వినియోగాన్ని అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం రెస్టారెంట్లకు కేవలం 75శాతం మాత్రమే గ్యాస్ సరఫరా జరుగుతోందని, హోటళ్లకు ఇచ్చే కోటా గ్యాస్ మరో రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ÷వ్ స్టార్ హోటల్స్ ప్రెసిడెంట్ స్వామి మాట్లాడుతూ, ÷వ్ స్టార్ హోటళ్లకు మరో 5 నెలల వరకు సరిపడా అటౌ గ్యాస్ కనెక్షన్ ఉందని తెలిపారు. అయితే, సాధారణ హోటళ్లు మూతపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హోటల్ యజమానుల సమస్యలను విన్న మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. అన్ని హోటళ్లు ఒకేసారి కాకుండా, ప్రాంతాల వారీగా షెడ్యూల్ ప్రకారం తెరిచి ఉంచేలా ఆలోచన చేయాలని మంత్రి సూచించారు. గ్యాస్ కొరతపై చర్చించేందుకు సోమవారం తర్వాత మంత్రుల కమిటీ సమావేశం కానుందని, ఆ రోజు హోటల్ అసోసియేషన్ ప్రతినిధులను కూడా పిలిచి చర్చించి కీలక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బర్నర్ల వినియోగం తగ్గించడం, ఇతర పొదుపు చర్యలపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయనుందని మంత్రి పేర్కొన్నారు.కాగా, వంటగ్యాస్ కొరత ప్రభావం సామాన్యులతో పాటు హోటల్ పరిశ్రమపై తీవ్రంగా పడుతోంది. ప్రభుత్వం తీసుకునే 'సోమవారం నిర్ణయం' రాష్ట్రంలోని వేలమంది హోటల్ కార్మికులు, వినియోగదారులపై ప్రభావం చూపనుంది.

## తొలి ఎఐ క్యాంపస్ కాలేజీగా బిట్స్ పిలాని

### మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ

### వేయికోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడి

అమరావతి,మార్చి13 : రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్‌గా ఉండబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఆ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు సైతం ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు వారు వివరించారు. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. బిట్స్ పిలానీ నిర్మాణ ప్లాన్లను మంత్రి నారా లోకేశ్ పరిశీలించారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి ప్లాన్లు చూపించారు. క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ కోర్సులు ఉంటాయని ప్రతినిధులు వివరించారు. రెండు దశల్లో 7 వేల మందికి అవకాశం కల్పించేలా నిర్మాణాలు ఉంటాయన్నారు. క్యాంపస్‌పై ఐదేళ్లలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెడతామని ప్రతినిధులు మంత్రికి తెలిపారు. 'నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో క్యాంపస్ నిర్మిస్తున్నాం. గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ విధానాలు పాటిస్తున్నాం. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి బిట్స్.. దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్ కానుంది. వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్యం సంరక్షణ కోర్సులు ఉంటాయి' అని బిట్స్ ప్రతినిధులు లోకేశ్‌కు వివరించారు. సాధ్యమైనంత త్వరగా క్యాంపస్ ప్రారంభించేలా చూడాలని లోకేశ్ సూచించారు. ఈ సందర్భంగా బిట్స్ చేపట్టిన నిర్మాణ ప్లాన్లను లోకేశ్ పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వారిని మంత్రి లోకేశ్ కోరారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా అమరావతి బిట్స్ పిలాని నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ క్యాంపస్‌పై వచ్చే ఐదేళ్లలో రూ. 1000 కోట్ల పెట్టుబడి పెడతామని వారు ఈ సందర్భంగా వివరించారు. అలాగే సీఎం చంద్రబాబునాయుడు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నామని తెలిపారు. బిట్స్ ప్రతినిధులు సిద్దార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమరావతి క్యాంపస్‌లో నిర్మించే భవనాల డిజైన్లను మంత్రి నారాయణకు వారు వివరించారు. రెండున్నరేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా మంత్రికి బిట్స్ ప్రతినిధులు తెలిపారు. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 70 ఎకరాల్లో బిట్స్ క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మూడు దశల్లో ఎఐ? క్యాంపస్‌గా బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేపట్టింది.

## ఏపి మాజీ డిజిపి హెచ్‌జె దొర మృతి

### అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి

### వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో కీలక పదవుల నిర్వహణ

హైదరాబాద్,మార్చి13 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్. జె. దొర మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంట్లో బాత్‌రూమ్‌లో ఆయన పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి హెచ్.జె.దొర.1996 నుంచి 2002 వరకు ఉమ్మడి ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచి వేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే సీఐఎస్ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు. 943లో శ్రీకాకుళంలో హెచ్.జె.దొర జన్మించారు. తన సుదీర్ఘ జీవితకాలంలో దాదాపు 40 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా దొర బాధ్యతలు చేపట్టారు. 2002లో డిప్యూటేషన్‌పై దేశ రాజధాని న్యూఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డీజీగా పని చేశారు. పోలీసు శాఖతోపాటు క్రీడారంగంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఇండియన్ ఒలంపిక్స్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1993లో పీపుల్స్ వార్ గ్రూపు లక్ష్యంగా చేసుకున్న 40 మంది పోలీసు అధికారుల జాబితాలో హెచ్.జె.దొర పేరు కూడా ఉంది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన పోలీస్ మెడల్ అందుకున్నారు.

## పలాసలో తొలి కిడ్నీ మార్పిడి విజయవంతం

### యువతి హేమశ్రీకి విజయవంతంగా శస్త్రచికిత్స

శ్రీకాకుళం,మార్చి13 : జిల్లాలోని పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో నిర్వహించిన తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం అయ్యింది. యువతి హేమశ్రీకి వైద్యులు కిడ్నీ రీ ఎ÷-లాంటేషన్ చేశారు. ఈ శస్త్ర చికిత్స పూర్తయిన తర్వాత హేమశ్రీతోపాటు ఆమె తండ్రిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ.. చాలా కాలంగా ఉద్దానాన్ని కిడ్నీ భూతం ఇబ్బంది పెడుతోందని తెలిపారు. శుక్రవారం పలాసలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం కావడంతో తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతంలోని నిరుపేద యువతి కిడ్నీ సమస్యతో బాధపడుతుందని చెప్పారు. ఆమెకు ప్రముఖ వైద్యులంతా వచ్చి ఈ శస్త్రచికిత్స నిర్వహించారని చెప్పుకొచ్చారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారందరికీ ఈ వైద్యులంతా ఒక నమ్మకాన్ని కలిగించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే శిరీష కృతజ్ఞతలు తెలిపారు. 2018లో తుపాన్ సమయంలో సీఎం చంద్రబాబు పలాసలోనే 18 రోజులపాటు ఉన్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తుపాన్ వచ్చిందని డొనేషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారికి ఇక్కడ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారని ఎమ్మెల్యే గౌతు శిరీష వెల్లడించారు

## దొర మృతికి సిఎంలు, ప్రముఖుల సంతాపం

అమరావతి/హైదరాబాద్,మార్చి13 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీసుశాఖకు బ్రాండ్ క్రియేట్ చేయడంలో హెచ్‌జే దొర కీలక పాత్ర పోషించారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. నక్సల్స్ సమస్య పరిష్కరించడంలో సమర్థంగా వ్యవహించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా హెచ్‌జే దొర సేవలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంలో, పోలీసు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం రేవంత్ తెలియజేశారు. హెచ్.జె.దొర మృతి పట్ల వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, పోలీస్ సంక్షేమ సంఘం సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

## కొయ్యూరులో 33 కిలోల గంజాయి స్వాధీనం

అల్లూరి,మార్చి13 : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 33 కేజీల గంజాయిని పోలీసుల స్వాధీనం చేసి, నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొయ్యూరు మండలం చీడిపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆటో, బైక్‌పై అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా.. ఆటోలో రెండు గోనె సంచుల్లో ఉన్న 33.245 కేజీల గంజాయిని ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయి రవాణా చేస్తున్న మసాడ బాబ్జి, పాంగి సింహాచలం, గంగుల సూర్య ప్రతాప్‌రెడ్డి, వంటాకుల రాజుబాబు అనే నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు. నిందితులు ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి సామర్లకోట ప్రాంతానికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వారి వద్ద నుంచి ఆటో, బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# డాల్బీ సినిమాస్ ఫార్మేట్‌లో పెద్ది విడుదల

తెలుగులో అగ్ర తారల సినిమాలు అత్యాధునిక సాంకేతిక హంగులతో రూపొందుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతుండడంతో అందుకు తగ్గ ప్రమాణాలు తమ సినిమాల్లో కనిపించేలా జాగ్రత్తలు తీసుకొంటున్నాయి నిర్మాణ సంస్థలు. రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రాన్నీ డాల్బీ సినిమాస్ ఫార్మేట్‌లో విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. ప్రత్యేకమైన కథా నేపథ్యం, భారీస్థాయి యాక్షన్ అంశాలు, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న ఈ సినిమా డాల్బీ ఫార్మేట్‌లో ప్రేక్షకులకు మరింత ఘనమైన, ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు చెప్పాయి. ఈ ఏడాది భారీస్థాయి అంచనాల మధ్య రూపొందుతున్న సినిమాల్లో 'పెద్ది' ఒకటి. ఏప్రిల్ 30న విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకుడు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు.








# ఓటిటిలోకి రవితేజ భర్త మహాశయుకలు విజ్ఞప్తి

## మాస్ కాదాస్ ఫంకీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు' చివరకు ఓటిటిలోకి వచ్చేసింది. దర్శకుడు కిషోర్ తిరుమల రూపొందించిన ఈ సినిమాలో హీరోయిన్లుగా ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి నటించారు. ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మంచి స్పందనను అందుకుంది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డీసెంట్ కలెక్షన్స్ సాధించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రవితేజ స్టైల్ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉండటంతో ప్రేక్షకులు సినిమాను బాగా ఆదరించారు. మాస్ మహారాజా గత కొన్ని సినిమాలతో పోలిస్తే ఈ సినిమా థియేటర్లలో మంచి రన్‌ను నమోదు చేసింది. 'భర్త మహాశయులకు' మాత్రం ఆలస్యంగా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇక తాజాగా ఈ సినిమా ఓటిటి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా కయాదు లోహర్ హీరోయిన్ గా దర్శకుడు అనుదీప్ కేవి తెరకెక్కించిన ఫన్ డ్రామా చిత్రమే 'ఫంకీ' థియేటర్స్ లో ఒక డిజప్పాయింట్ చేయగా, ఈ మూవీ ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ చిత్రాన్ని పాపులర్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఈ సినిమా నేటి నుంచి అందుబాటులోకి వచ్చింది. అనుదీప్ గత సినిమా ప్రిన్స్ కూడా థియేటర్స్ తర్వాత ఓటీటీ లోకి వచ్చాక ఓ వర్గం ఆడియెన్స్ ని ఫ్యాన్స్ చేసుకుంది. మరి అలానే ఫంకీ కి కూడా జరుగుతుందా లేదా అనేది వేచి చూడాలి.




# ఓటిటిలోకి బార్డర్-2

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన భారీ యుద్ధ చిత్రం 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లను సాధించి ప్రస్తుతం ఓటీటీ విడుదలకు సిద్ధమవుతోంది. 1997లో వచ్చిన క్లాసిక్ వార్ డ్రామా 'బోర్డర్'కు సీక్వెల్‌గా, అనురాగ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జనవరి 23న థియేటర్లలో విడుదలై సుమారు రూ. 480 కోట్లకు పైగా వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ భారీ విజయం తర్వాత, ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం మార్చి 20 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 1971 భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి కీలక పాత్రల్లో నటించి మెప్పించారు.




# నాలుగేళ్ల వివాహ బంధానికి చెల్లుచీటి

## ఆశను కోల్పోకుండా ముందుకు సాగాల్సిందే : హన్సిక

నటి హన్సిక తన భర్త నుంచి విడాకులు తీసుకుని,. నాలుగేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు విడాకుల అనంతరం ఆమె తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబీ పదం 'చార్దీ కలా..' అని రాశారు. ఎప్పుడూ ఉత్సాహంతో ముందుకుసాగాలని.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశను కోల్పోవద్దని దీని అర్థం. 2022 డిసెంబర్‌లో సోహైల్-హన్సిక వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో ఆమె సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో విడాకుల రూమర్స్ మొదలయ్యాయి. మార్చి 11న వీరికి కోర్టు విడాకులు మంజూరుచేసింది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన అందం, నటనతో అలరించిన ప్రముఖ నటి హన్సిక మోత్వాని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్త నెట్టింట ఎంతగా వైరల్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోహైల్ కతూరియాని ప్రేమించి పెళ్లి చేసుకున్న హన్సిక అతనికి విడాకులు ఇచ్చినట్టు జోరుగా ప్రచారం సాగింది. కొంతకాలంగా ఈ జంట మధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుండగా, ముంబైలోని బాంద్రా కోర్టు వీరి విడాకులను ఖరారు చేసిందని కొన్ని మీడియా వర్గాల్లో వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. అయితే తాజాగా హన్సిక తన సోషల్ మీడియాలో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. పెళ్లి తర్వాత కొంతకాలం వరకు ఈ జంట సంతోషంగా జీవిస్తున్నట్లు కనిపించింది. అయితే పెళ్లి అనంతరం కొన్ని నెలలకే వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయని సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా హన్సిక తన భర్తకు దూరంగా ఉంటూ తల్లితో కలిసి నివసిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి భర్తతో కలిసి ఉన్న పెళ్లి ఫోటోలను తొలగించడం కూడా ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది.

# సముద్ర ఖని కార్మేని సెల్వాయి

నేటి ఆధునిక కాలంలో డబ్బు, కుటుంబం మరియు మనుషుల ఆశయాల చుట్టూ తిరిగే ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'కార్మేని సెల్వం'. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా, రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళంలో రూపొందిన ఈ ద్విభాషా చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సముద్రఖని కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్ర పోషించగా, లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ప్రముఖ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, యువరాజ్ దక్షన్ ఛాయాగ్రహణం అందించారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి అంటూ విలక్షణ నటుడు సముద్రఖని చెప్పే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ఈ టీజర్, నేటి సమాజంలో ఉన్న ఆర్థిక సవాళ్లను కళ్ళకు కట్టినట్లు చూపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ కల్చర్, ఈఎంఐల భారం, క్రిఎ÷-టో పెట్టుబడులు మరియు త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు మధ్యతరగతి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఇందులో అర్థవంతంగా చూపించారు. సముద్రఖని తన కుటుంబంతో గడిపే హృద్యమైన సన్నివేశాలు ఒకవైపు, విదేశాల్లో ఒంటరిగా కనిపించే దృశ్యాలు మరోవైపు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. టీజర్ చివర్లో 'రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలి? డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి' అని సముద్రఖని చెప్పే డైలాగ్ నేటి వినియోగదారి తత్వానికి అద్దం పడుతోంది. సామాజిక సందేశంతో పాటు కమర్షియల్ విలువలతో రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.







# అల్లు అర్జున్, అట్లీల ప్రాజెక్ట్‌పై కథనాలు

## ఆసక్తి రేకెత్తిస్తున్న తాజా వార్తలు

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రాజెక్టులలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా ఒకటి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌ను కేవలం పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తున్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న అట్లీ, ఈ కొత్త ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికర వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా గ్లింప్స్‌ను బాలీవుడ్ బాద్షా షారూఖ్ ఖాన్ చేతుల మీదుగా విడుదల చేయాలని చిత్ర బృందం ఆలోచిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఇది నిజమైతే, అది సాధారణ ప్రమోషన్ మాత్రమే కాకుండా గ్లోబల్ మార్కెటింగ్ స్టాటజీగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే అల్లు అర్జున్ పుష్ప2 సినిమాతో దేశవ్యాప్తంగా భారీ గుర్తింపు పొందారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆయనకు మంచి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. అయితే షారుక్ ఖాన్‌కు ఉన్న అంతర్జాతీయ క్రేజ్ మరో స్థాయిలో ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు కోట్లాది అభిమానులు ఉన్నారు. అందుకే షారుక్ ఖాన్ ఈ సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేస్తే, అది కేవలం ఒక ప్రాంతీయ సినిమా ప్రమోషన్‌గా కాకుండా 'ఇండియన్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్'గా ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో సినిమాపై భారీ హైప్ ఏర్పడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. షారుక్ ఖాన్ సోషల్ మీడియా ద్వారా జరిగే ప్రచారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులకు చేరుతుంది. దీంతో అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలు వంటి విదేశీ మార్కెట్లలో సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశముంది. ప్రస్తుతం ఈ వార్తలపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

# అలా మొదలైంది మా ప్రేమ ప్రయాణం

నయనికతో ప్రేమను పంచుకున్న అల్లు శిరీష్ టాలీవుడ్ యువ హీరో అల్లు శిరీష్ ఇటీవల పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. మార్చి 6న హైదరాబాద్‌లో జరిగిన ఘనమైన వేడుకలో తన ప్రియురాలు నయనిక రెడ్డిని వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లి వేడుకకు కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లి తర్వాత ఈ జంట తమ తమ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అల్లు శిరీష్ తన లవ్ స్టోరీ, పెళ్లి నిర్ణయం, హనీమూన్ ప్లాన్స్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అల్లు శిరీష్ తెలిపిన వివరాల ప్రకారం, నయనికను మొదటిసారి ఒక పార్టీలో కలిశానని చెప్పారు. ఆ పార్టీని హీరో నితిన్, ఆయన భార్య షాలిని కందుకూరి ఏర్పాటు చేశారు. అది హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి వివాహం సందర్భంగా జరిగిన పార్టీ అని ఆయన వివరించారు. నయనిక, శాలినికి బెస్ట్ ఫ్రెండ్ కావడంతో అక్కడే మొదటిసారి ఇద్దరం కలుసుకున్నామని చెప్పారు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని శిరీష్ వెల్లడించారు. డేటింగ్ ప్రారంభించినప్పటి నుంచే ఇద్దరూ పెళ్లి గురించి మాట్లాడుకున్నామని అల్లు శిరీష్ తెలిపారు. భవిష్యత్తులో కుటుంబం ఏర్పాటు చేసుకోవాలని ఇద్దరికీ ఒకే అభిప్రాయం ఉందని చెప్పారు. తమకు పుట్టబోయే పిల్లలు ఇంట్లో తప్పకుండా తెలుగులో మాట్లాడాలని కూడా ఇద్దరూ నిర్ణయించుకున్నామని కూడా చెప్పారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787